జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 14 సంచిక 340 విశాఖపట్నం బుధవారం 25 ఆగష్టు 2021 8 పేజీలు వెల : 5.00

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం: జగన్




తాడేపల్లి,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిలో భాగంగా 10లక్షల 45వేల కుటుంబాలకు రూ.905.57 కోట్లు చెల్లించినట్లు సీఎం జగన్ తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారుల బ్యాంకు ఖాతాల్లో రెండో విడత పరిహారాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రెండో దశ కింద రూ.20వేల లోపు 7 లక్షల మంది డిపాజిటర్ల ఖాతాల్లో రూ.666.84 కోట్ల నగదు జమ చేశామని పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థ బాధితులకు న్యాయం చేసిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేదని, పేద ప్రజల కోసం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని సీఎం జగన్ అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న మనుషుల కోసమే అగ్రిగోల్డ్ స్కామ్ జరిగిందని, గత ప్రభుత్వం అగ్రిగోల్డ్ యాజమాన్యంతో కుమ్మక్కైందని సీఎం జగన్ అన్నారు. ప్రైవేట్ సంస్థ బాధితులకు న్యాయం చేసిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేవని, 2019 నవంబర్‌లోనే 3.40 లక్షల మందికి రూ.238.73 కోట్లు చెల్లించామని సీఎం జగన్ తెలిపారు. రూ.20వేల లోపు డిపాజిటర్ల ఖాతాల్లో రూ.666.84 కోట్లు, 10లక్షల 45వేల కుటుంబాలకు రూ.905.57 కోట్లు జమ చేశామని సీఎం తెలిపారు. అగ్రిగోల్డ్ వ్యవహారం కొలిక్కి రాగానే మిగిలిన డిపాజిటర్లకు చెల్లింపులు ఉంటాయని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వం కష్టజీవుల సొమ్మును కాజేసింది అగ్రిగోల్డ్ సంస్థను నమ్మి చిన్న వ్యాపారులు నష్టపోయారని, ఆ సంస్థలో ఉన్న డబ్బంతా కష్టజీవులదేనని సీఎం జగన్ అన్నారు. గత ప్రభుత్వం కష్టజీవుల సొమ్మును కాజేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ స్కామ్‌కు కర్త, కర్మ, క్రియ గత ప్రభుత్వమేనని సీఎం తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న మనుషుల కోసమే అగ్రిగోల్డ్ స్కామ్‌మని, బాధితులకు ఒక్క రూపాయి చెల్లించలేదని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మోసం చేస్తూ వచ్చిందని సీఎం జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి సుచరిత మాట్లాడుతూ.. ప్రైవేట్ సంస్థ బాధితులకు న్యాయం చేసిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేదని, గతంలో 300 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం జగన్ అండగా నిలిచారని తెలిపారు. రూ.20వేల లోపు డిపాజిటర్ల ఖాతాల్లో రూ.666.84 కోట్ల నగదు జమ చేస్తున్నారని, ఇప్పటికే రూ.10వేలలోపు డిపాజిటర్లకు రూ.238.73 కోట్లు చెల్లించారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో బాధితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు మొదటి దశలో రూ.10 వేల లోపు డిపాజిట్‌దారులైన 3.40 లక్షల మందికి 2019లోనే రూ.238.73 కోట్లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో మొదటి, రెండో దశలో కలిపి మొత్తం 10.40 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం రూ.905.57 కోట్లు పంపిణీ చేసినట్లు అయింది.

## ఏపీ ప్రభుత్వ పనితీరును అభినందిస్తున్నాం: జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ ఛైర్మన్



గుంటూరు,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఇటీవల గుంటూరు నగరంలో జరిగిన బీటెక్ విద్యార్థిని రమ్య దారుణ హత్య దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్ స్పాట్ విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఈ బృందం మంగళవారం గుంటూరులో పర్యటించింది. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ ఛైర్మన్ అరుణ్ హల్దర్ మాట్లడుతూ.. ఈ ఘటన చాలా బాధ కలిగించిందిని అన్నారు. అతి తక్కువ సమయంలోనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. నిందితుడిపై త్వరగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని కోరామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరును అరుణ్ హల్దర్ ప్రశంసించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం కూడా ఏపీ ప్రభుత్వం వెంటనే అందించింది ఆయన చెప్పారు. ఏపీ ప్రభుత్వ దృక్పథం చాలా పాజిటివ్‌గా ఉందిని ఆయన వివరించారు. దేశం మొత్తం ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును పరిగణనలోకి తీసుకోవాలి వైస్ ఛైర్మన్ అన్నారు. గుంటూరు రూరల్, అర్బన్ పోలీస్ అధికారులు బాగా పని చేశారు. వారందరికీ అవార్డులు ఇవ్వాలని సిఫార్సు చేస్తామని వైస్ ఛైర్మన్ అరుణ్ హల్దర్ తెలిపారు.

## ఇళ్ల లేఅవుట్ల వద్దే సామాగ్రి సరఫరా: మంత్రి శ్రీరంగనాథరాజు



విజయవాడ,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: తక్కువ ధరకే పేదలకు ఇళ్ల నిర్మాణ సామాగ్రిని అందిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి లబ్ధిదారునికి 40 శాతం తక్కువ ధరకే సామాగ్రిని అందిస్తున్నట్లు, ఇళ్ల లే ఔట్ల దగ్గరకే మెటీరియల్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.వేల కోట్లు ఆదా చేయడంతో పాటు అదనంగా ఇంటి నిర్మాణానికి పేదలకు పావలా వడ్డీకి రుణం ఇప్పిస్తున్నామన్నారు. చదవండి: ఓరి భగవంతుడా .. కష్టాలు గట్టెక్కాయని అనుకునేలోపే.. లబ్ధిదారులకు ఆప్షన్ లు బలవంతంగా మారుస్తున్నారన్నది తప్పుడు ప్రచారమని, వారికి ఎలా కావాలంటే అలా ఇళ్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. అక్టోబర్ 25 నుంచి మూడో కేటగిరి ఇళ్ల నిర్మాణం చేపడతున్నట్లు తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో సిఎం మార్పు..

### రాహుల్ వద్దకు పంచాయితీ




న్యూఢిల్లీ,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్‌లో సంక్షోభం తారస్థాయికి చేరింది. సిఎం భూపేష్ బగేల్, ఆరోగ్య శాఖ మంత్రి టిఎస్ సింగ్ దేవ్‌ల మధ్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సంక్షోభం ఢిల్లీకి చేరింది. వీరిద్దరు మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. అయితే అధిష్టానం ఆదేశాలతోనే తాను ఢిల్లీకి వచ్చినట్లు మంత్రి సింగ్ దేవ్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో సిఎం మార్పు జరుగుతుందన్న ప్రచారం జోరందుకుంది. 2018 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు భూపేష్ బగేల్‌తోపాటు టిఎస్ సింగ్ దేవ్‌లు కూడా ముఖ్యమంత్రి రేస్‌లో పోటీపడ్డారు. అయితే అధిష్టానం మాత్రం భూపేష్ బగేల్‌ను సిఎంగా ప్రకటించింది. రెండున్నరేళ్ల అనంతరం టిఎస్ సింగ్ దేవ్‌ను ముఖ్యమంత్రిగా నిర్ణయిస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు సమాచారం. గత జూన్ నెలతో భూపేష్ బగేల్ ముఖ్యమంత్రిగా రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తయింది. దీంతో ఛత్తీస్‌గఢ్ సిఎంగా టిఎస్ సింగ్ నియమితులవుతారా అనే చర్చ జరుగుతోంది. నేడు రాహుల్ గాంధీతో ఇరువురు నేతలు సమావేశం కావడంతో ఈ ఊహాగానాలు వాస్తవమేనని, ఈ అంశంపైనే చర్చలు జరుగుతున్నాయని ప్రచారం సాగుతోంది.

## కేంద్ర మంత్రి నారాయణ్ రాణె అరెస్ట్



ముంబై,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేను చెంప దెబ్బ కొట్టేవాడినని చేసిన వ్యాఖ్యలపై పోలీసులు కేంద్ర మంత్రి నారాయణ్ రాణెను అరెస్ట్ చేశారు. ఇప్పటికే కేంద్రమంత్రి ఉన్న సంగమేశ్వర్‌కు వెళ్లిన పోలీసుల బృందం.. అరెస్ట్ ప్రక్రియను కొనసాగిస్తోంది. అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ముందస్తు బెయిల్ కోసం రత్నగిరి కోర్టు, బాంబే హైకోర్టులకు వెళ్లిన నారాయణ్ రాణెకు రెండు చోట్లా చుక్కెదురైంది. తన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాలన్న పిటిషన్‌ను బాంబే హైకోర్టు తిరస్కరించింది. దేశానికి ఏ ఏడాది స్వాతంత్ర్యం వచ్చిందో తెలియని ఉద్ధవ్ థాక్రేను తాను చెంప దెబ్బ కొట్టేవాడినని సోమవారం ఓ ర్యాలీలో అన్నారు కేంద్ర మంత్రి నారాయణ్ రాణె. దీనిపై శివసేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు పోలీస్ స్టేషన్‌లలో ఆయనపై ఫిర్యాదులు చేసింది. బీజేపీ కార్యాలయాలపై శివసేన కార్యకర్తలు దాడులు కూడా చేశారు.

## బంగాళాఖాతంలో భూకంపం.. ఎపిలోని పలు తీర ప్రాంతాల్లో ప్రకంపనలు!



అమరావతి,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: బంగాళాఖాతంలో భూకంపం సంభవించింది. భూకంప రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.1గా నమోదైంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు తీర ప్రాంతాల్లో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి 260 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాడిత పద్మ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు: పవన్



అమరావతి,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: జనసేన పార్టీలో క్రియాశీల నేత బాడిత పద్మ కన్నుమూశారని తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ఎంతో నిబద్ధతతో ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు తపించారని చెప్పారు. విజయవాడలో నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేవారని పేర్కొన్నారు. పద్మ ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని
చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను
మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

# గోరంట్ల అస్త్రంతో బాబు ఉక్కిరిబిక్కిరి

రాజమండ్రి,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం లో ఎవరికి లభించని అవకాశాలు రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి దక్కాయనే చెప్పాలి. పార్టీ ప్రారంభం నుంచి ఆయన ఏ ఎన్నికల్లో టిడిపి టికెట్ ను మిస్ అవ్వలేదు. ఎన్నిసార్లు ఆయన్ను చంద్రబాబు పక్కకు పెట్టాలనుకున్నప్పటికీ అనివార్యంగా టికెట్ ఇవ్వక తప్పని పరిస్థితిని గోరంట్ల బుచ్చయ్య చౌదరి కల్పించారు. దాని ఫలితంగానే మొన్నటి ఎన్నికలతో కలిపి తొమ్మిది సార్లు అసెంబ్లీ టికెట్ గోరంట్లకు దక్కడం ఒక రికార్డ్ గానే చెప్పొచ్చు. అలాంటి గోరంట్ల కు పార్టీనుంచి పోతే కానీ మనశ్శాంతి లభించదన్నంత వేదన ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం తన స్కూల్ నుంచి వచ్చిన ఆదిరెడ్డి కావడం గమనార్హం. అప్పారావు టిడిపి లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారనగానే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదిరెడ్డికి చెక్ పెట్టేందుకు ఆయన తోడల్లుడు చల్లా శంకర రావు ను టిడిపి తీర్థం పుచ్చుకునేలా చేశారు.రాజమండ్రి ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా శంకర రావు నాడు పనిచేసేవారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆదిరెడ్డి తోడల్లుడు శంకర రావు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన రికార్డ్ ఉంది. గోరంట్ల బుచ్చయ్య చౌదరి తో నాడు సమాన ఓట్లను శంకర రావు తెచ్చుకోగలిగారు. గోరంట్ల శంకర రావు లు ఓడిపోయి స్వల్ప ఆధిక్యతతో వీరిద్దరిపై 2009 లో రౌతు సూర్యప్రకాశరావు కాంగ్రెస్ ను గెలిచారు. ఇవన్నీ చంద్రబాబు కు వివరించి మచ్చలేని చల్లా కుటుంబానికి అవకాశం ఇవ్వాలని పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రోత్సహించవద్దని గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారని అంటారు . అప్పారావు కు టికెట్ ఇస్తే ఆయన పార్టీలో ఉంటారో పోతారో తెలియదని గత అనుభవాలను బాబు ముందు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉంచారని పార్టీ వర్గాల్లో ప్రచారం. తన తోడల్లుడినే అడ్డుపెట్టి బుచ్చయ్య వేస్తున్న ఎత్తుగడలను చిత్తు చేస్తూ చంద్రబాబు, నారా లోకేష్ లతో గట్టి లాబీయింగ్ చేయడం లో సక్సెస్ అయ్యారు ఆదిరెడ్డి అప్పారావు.ఎర్రన్నాయుడు కుటుంబం పార్టీ ఆరంభం నుంచి చంద్రబాబు తో ఉండటం ఆదిరెడ్డి కుటుంబానికి అవకాశాలు కల్పించడానికే అధిష్టానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ టికెట్ ను తన కోడలు ఆదిరెడ్డి భవాని కి ఇప్పించి ఆమె గెలవడం లో అప్పారావు గట్టి ప్రణాళికతో పని చేశారు. ఆమె కూడా 30 వేలకు పైగా మెజారిటీ తో వైసిపి హవాను ఎదుర్కొని రెండుసార్లు ఎమ్మెల్యే గా పనిచేసిన అనుభవజ్ఞుడు రౌతు సూర్య ప్రకాశరావు పై గెలిచారు. ఆమె గెలుపు తరువాత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ని రాజమండ్రి నియోజకవర్గంలో చెయ్యి కాలు పెట్టకుండా చేయడంలో ఆదిరెడ్డి చాక చక్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకటి రెండు సందర్భాల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ? ఆదిరెడ్డి ఆధిపత్యం కోసం రోడ్డెక్కిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అధిష్టానం ఎవరి నియోజకవర్గాలకు వారిని పరిమితం చేసేలా రాజీ చేయడంతో కొంత కాలంగా వివాదాలు సద్దుమణిగేలాగే కనిపించినా నివురు గప్పిన నిప్పులాగే పరిస్థితి కొనసాగింది.పార్టీలో తన ప్రభ మసకబారుతు ఉండటంతో ఇక గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇప్పుడు బ్రహ్మాస్త్రం ప్రయోగానికి సిద్ధం అయ్యారు. తన వర్గం వారిని అర్బన్ లో ఆదిరెడ్డి కుటుంబం పక్కన పెడుతూ ఉండటం పార్టీ పదవుల్లో సైతం వారికి అన్యాయం జరగడం వంటి పరిణామాలు గోరంట్లకు తాడో పేడో తేల్చుకోవాలనే నిర్ణయం వైపు నడిపించాయి. ఆయనలో అణచుకున్న అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలైంది. చివరికి పార్టీకి పదవికి గుడ్ బై కొట్టేయాలనంత నిర్వేదం ఆవరించింది. ఈ పరిణామం చంద్రబాబు కు సంకటం గా మారింది. గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్లకు తలొగ్గితే ఆదిరెడ్డి కుటుంబం కినుక వహిస్తుంది. ఆదిరెడ్డి చెప్పినడానికే సై అంటే గోరంట్ల తనదారి తాను చూసుకోక తప్పదు. ఇలాంటి తరుణంలో మధ్యే మార్గం కోసం బాబు వెతకుతున్నారు.

## 18 సంవత్సరాలు దాటిన వారికీ కరోనా వ్యాక్సిన్

**కారంపూడి పి హెచ్ సి వైద్య అధికారి బాలకిషోర్ నాయక్**



కారంపూడి, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: 18 సంవత్సరాలు దాటినా వారికి కరోనా వ్యాక్సిన్ వేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందయని కారంపూడి పి హెచ్ సి వైద్య అధికారి బాలకిషోర్ నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లాలో నియోజకవర్గనికి మూడు మండలాలు కేటాయించారాని మాచర్ల నియోజకవర్గంలో మాచర్ల, దుర్గి, కారంపూడి లను ఎంపిక చేయటం జరిగిందని ఈ మూడు మండలలలో ఒక్కొక్క సచివాలయంలోనే వ్యాక్సిన్ వేయటం జరుగుతుందని కారంపూడి మండలానికి సంబంధించి కారంపూడి సచివాలయన్ని ఎంపిక చేయటం జరిగిందని అయన తెలిపారు. సుమారు 1000 డోసుల వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని కారంపూడి ప్రజలు సద్వినియోగం చేసుకొని కరోనా 18 సంవత్సరాలు దాటినా ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు తీసుకోని వ్యాక్సిన్ వేయించుకోవచ్చని వైద్య అధికారి బాలకిషోర్ నాయక్ తెలిపారు.

# కొణతాలలకు బ్యాడ్ టైమ్ స్టార్టయినట్టేనా..?



విశాఖపట్టణం, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: విశాఖ జిల్లాలో ఒకనాడు చక్రం తిప్పిన నాయకుడు కొణతాల రామకృష్ణ. ఆయన రాజకీయ ప్రవేశమే లక్కీగా సాగింది. ఆయన 1989లో నాటి టీడీపీ సిట్టింగ్ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం మీద కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో గెలిచి దేశాన్ని ఆకట్టుకున్నారు. గిన్నీస్ రికార్డుకు కూడా ఎక్కారు. అలా వరసబెట్టి నాలుగు దఫాలు అనకాపల్లి నుంచి ఎంపీ అయ్యాక కొణతాల రామకృష్ణ 2004లో ఎమ్మెల్యేగా తొలిసారి పోటీ చేసి గెలిచారు. నాడు వైఎస్సార్ ప్రభుత్వంలో జిల్లాలో ఏకైక మంత్రిగా చక్రం తిప్పారు. వైఎస్సార్ కూడా విశాఖ జిల్లాకు కొణతాలను సామంతరాజుగా చేసేశారు. వైఎస్ తొలిసారి సీఎం అయినప్పుడు జిల్లాలో కొణతాల ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది.కొణతాల రామకృష్ణ 2009 ఎన్నికల్లో మాత్రం ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు చేతిలో ఓడిపోయారు. అదే ఆయన రాజకీయానికి అతి పెద్ద బ్రేక్ వేసేసింది. వైఎస్సార్ బతికి ఉంటే నామినేటెడ్ పదవో, రాజ్యసభ సీటో ఆయనకు దక్కేది. కానీ వైఎస్సార్ చనిపోవడంతో కొణతాల రామకృష్ణ రాజకీయం కూడా రివర్స్ అయింది. ఆయన జగన్ వైపు వచ్చారు. వైసీపీ ఆవిర్భావంలో చురుకైన పాత్ర పోషించారు. ఇక 2014 ఎన్నికల్లో ఆయన తన తమ్ముడికి అనకాపల్లి టికెట్ ఇప్పించుకున్నారు. విశాఖలో వైసీపీ ఎంపీగా పోటీ చేసిన వైఎస్ విజయమ్మ కోసం కొణతాల రామకృష్ణ ప్రచారం చేశారు. కానీ ఆమె ఓటమి పాలు అయింది. దాంతో కొణతాల విపక్షాలతో కుమ్మక్కు కావడం వల్లనే ఇలా జరిగింది అని జగన్ భావించి ఆయన్ని పార్టీకి దూరం పెట్టారు.ఆ తరువాత కొణతాల రామకృష్ణ టీడీపీలో చేరినా కూడా అక్కడ కూడా మర్యాద దక్కలేదు. ఆయన రాజ్యసభ సీటు కోరుకున్నా చంద్రబాబు ఇవ్వలేదు. ఇక అనకాపల్లి ఎంపీ సీటు కూడా ఇవ్వకపోవడంతో కొణతాల రామకృష్ణ బాగా నిరాశపడ్డారు, 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలు కావడంతో కొణతాల పూర్తిగా రాజకీయ సన్యాసం చేసేశారు. అయితే ఆయని తిరిగి వైసీపీ వైపుగా తీసుకువచ్చేందుకు కొంతమంది ప్రయత్నించారు. కానీ జగన్ మాత్రం ససేమిరా అంటూనే వచ్చారు. ఇక తాజాగా అనకాపల్లి లో కొణతాల ఫ్యామిలీ ఆక్రమించుకున్న దేవాలయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో కొణతాలలకు వైసీపీ పూర్తిగా రెడ్ సిగ్నల్ చూపించింది అనే అంటున్నారు. మొత్తానికి చూస్తే కొణతాల రామకృష్ణ పొలిటికల్ కెరీర్ కంప్లీట్ గా క్లోజ్ అయిందనే చెప్పాలి. ఆయన వియ్యంకుడు అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు 2024లో టికెట్ వచ్చినా కొణతాల సరే అనాల్సిందే తప్ప అంతకు మించి ఆయన సౌండ్ చేసే సీన్ టీడీపీలో లేదనే అంటున్నారు. ఎలాంటి కొణతాల రామకృష్ణ ఎలా అయిపోయారు అనే ఇపుడు జిల్లా రాజకీయాల్లో చర్చించుకునే పరిస్థితి ఉంది.

## వాళ్లద్దిరిని దగ్గర చేస్తున్న జగన్

విజయవాడ, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఔను? బీజేపీ కనుక టీడీపీతో చేతులు కలిపితే.. అది జగన్ చేసుకున్న స్వయంకృత అపరాధమే అవుతుందని అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం బీజేపీ అవసరం జగన్‌కు ఎంత ఉందో.. అంతకన్నా ఎక్కువగా టీడీపీకి ఉంది. 2014 ఎన్నికల్లో టీడీపీ.. బీజేపీతోనే చేతులు కలిపి అధికారం దక్కించుకుంది. కేంద్రంలోనూ మంత్రి పదవులు దక్కించుకుంది. 2019 ఎన్నికలకు వచ్చే సరికి బీజేపీని విడిచిపెట్టి ఒంటరి పోరు చేసింది. ఇది అప్పట్లో కరెక్టేనని టీడీపీ అధినేత చంద్రబాబు భావించారు. అయితే.. రాను రాను పరిస్థితులను సమీక్షించుకున్న సీనియర్లు.. అది చాలా పెద్ద తప్పని నిర్ణయానికి వచ్చారు.దీంతో అప్పటి నుంచి తిరిగి బీజేపీతో చేతులు కలిపేందుకు టీడీపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఎప్పుడు అవకాశం చిక్కినా.. బీజేపీతో కలిసి ప్రయాణం చేయాలని భావిస్తోంది. ఇక, ఇప్పుడు.. టీడీపీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. వచ్చే ఎన్నికల్లో మీరు అడిగిన సీట్లు ఇస్తాం.. కలిసి పోటీ చేద్దాం.. అని చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు.. కేంద్రంలో మంత్రిగా కూడా చక్రం తిప్పిన నేత బీజేపీకి ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే.. ప్రస్తుతం టీడీపీకి ఉన్న వ్యతిరేకత, పుంజుకుంటుందో లేదో తెలియని సందిగ్ధంలో ఉన్న నేపథ్యంలో బీజేపీ నేతలు ఈ విషయంపై ఎటూ తేల్చలేదు.ఇదిలావుంటే.. మరోవైపు.. బీజేపీనే స్వయంగా.. జగన్‌తో జట్టుకట్టేందుకు రెడీ అవుతోంది. కేంద్రంలో అవసరాలే దీనికి ప్రధాన ప్రాతిపదికగా ఉన్నాయి. వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్రపతి ఎన్నికలో జగన్ నిర్ణయం అత్యంత కీలకంగా మారింది. అదే సమయంలో మోడీ ముచ్చటగా మూడోసారి కూడా ప్రధాని అవ్వాలంటే.. జగన్ మద్దతు అప్పటికి అవసరమైన అనివార్య పరిస్థితి రానుంది. ఈ క్రమంలో బీజేపీ కొన్నాళ్లుగా జగన్‌ను బుజ్జగిస్తోంది. కీలక నిర్ణయాలు తీసుకోకపోయినా.. జగన్‌కు అప్పాయింట్‌మెంట్ ఇవ్వడంతోపాటు.. పార్టీ నేతలు.. జగన్‌పై విమర్శలు చేయకుండా.. ముఖ్యంగా మిత్రపక్షం జనసేనను కట్టడి చేయడంలోనూ.. కేంద్రంలోని బీజేపీ పెద్దలు పరోక్షంగా సహకరిస్తున్నారు.ఈ క్రమంలో ఇప్పుడు జగన్ బీజేపీతో చేతులు కలిపితే.. ఒక విధంగా రాజకీయాలు మారనున్నాయి. అలాకాకుండా.. ఆయన బెట్టుకుపోయి.. బీజేపీని కాదంటే.. ఆ లోటును భర్తీ చేసేందుకు టీడీపీ కాచుకుని కూర్చుంది. బీజేపీ కూడా జగన్ ను బతిమాలకుండా.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే.. మొత్తానికే జగన్‌కు ఇబ్బందులు రావడంతోపాటు ఏపీలో రాజకీయ సమీకరణలు అనూహ్యంగా మలుపుతిరిగి.. వైసీపీకి నష్టం చేకూరుస్తాయని అంటున్నారు పరిశీలకులు. ఈ క్రమంలో బీజేపీ-టీడీపీ జట్టుకడితే.. అది జగన్‌దే తప్పవుతుందని అంటున్నారు. మరి సీఎం ఏం చేస్తారో చూడాలి.

## లోకల్ లీడర్లకు నో ఎంట్రీ

శ్రీకాకుళం, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఎంత మంత్రి అయినా.. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సి ఉన్నా.. స్థానికంగా కూడా పట్టించుకుంటారు. లోకల్ పాలిటిక్స్‌పై ఎప్పుడూ.. ఒక కన్నేసి ఉంచుతారు. అంతేకాదు, స్థానికంగా ఉన్న నేతలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. ఎందుకంటే .. మళ్లీ మళ్లీ విజయం దక్కించు కోవాలంటే.. ఖచ్చితంగా స్థానిక నేతలను ఆదరించాల్సిన.. వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఢిల్లీకి రాజు అయినా స్థానికంగా పట్టు లేకపోతే వాళ్ల పొలిటికల్ లైఫే క్లోజ్ అవుతుంది. రాష్ట్ర స్థాయిలో మంత్రులుగా ఉన్న నేతలు కూడా లోకల్‌గా ప్రజల్లో పట్టు లేక పతనమైపోయిన వారు ఎందరో ఉన్నారు. ఇది అందరికీ.. అన్ని పార్టీల నేతలకూ తెలిసిన విషయమే. అయితే.. ఉత్తరాంధ్ర మంత్రి సీదిరి అప్పలరాజుకు మాత్రం.. లోకల్ లీడర్లు, లోకల్ పాలిటిక్స్ గురించి అస్సలు ఇష్టం లేదట. ఈ మాట ఇప్పుడు ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న పలాస నియోజకవర్గంలోనే.. అది కూడా వైసీపీ కేడర్లోనే వినిపిస్తోంది.మంత్రి అప్పలరాజుని కలిసి.. తమ కష్టాలను చెప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్న లోకల్ లీడర్లను సదరు మంత్రి పీఏలు దగ్గరకు కూడా రానివ్వడం లేదని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఎవరైనా నేతలు.. పట్టుబట్టి.. అప్పాయింట్‌మెంట్ దక్కించుకున్నా.. కూడా లోకల్ విషయాలు మాట్లాడొద్దని.. ముందుగానే వారికి దిశానిర్దేశం చేస్తున్నారట. మరి ఎందుకు ఇలా అప్పలరాజు మారిపోయారు ? అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానం వస్తోంది. తాను నియోజకవర్గాన్ని జయించానని.. అందుకే తనకు మంత్రి పదవి ఇచ్చారని.. తనకు తిరుగులేదన్న భావనతో ఆయన వ్యవహరిస్తున్నారని పార్టీ నేతలు మండిపడుతున్నారు.అయితే.. నిజానికి అప్పలరాజుకు అతిపిన్న వయసులోనే పదవి లభించింది. దశాబ్దాలుగా అక్కడ బలమైన నేతలుగా ఉన్న వారిని కాలం కలిసొచ్చి? జగన్ వేవ్‌లో ఆయన ఓడించారు. సామాజిక సమీకరణల్లో ఎవ్వరికి రానట్టుగా రెండేళ్లకే లక్ చిక్కి మంత్రి పదవి కూడా వచ్చింది. ఆ తర్వాత ఆయన వైఖరిలో పూర్తి మార్పు వచ్చిందట. ఆయన ఏదో సాధించానని ఇప్పుడే భావించడం సరికాదు. ఇంకా చాలా లైఫ్ ఉంది.. కానీ, ఆయన వైఖరి.. ఆయన పీఏలు చేస్తున్న హడావుడి చూస్తే.. మాత్రం.. రెండు మూడు సార్లు మంత్రిగా చేసిన వారికంటే కూడా ఎక్కువగానే వ్యవహరిస్తున్నారని.. ఇది పార్టీకి.. తనకు కూడా మంచిది కాదని సూచిస్తున్నారు.జిల్లాలో ఉన్న మరో కీలక నేతతో పాటు మూడున్నర దశాబ్దాలుగా ఉన్న సీనియర్ నేతలను సైతం డామినేట్ చేసేలా అప్పలరాజు వ్యవహార శైలి ఉందని సొంత పార్టీ నేతలే నొచ్చుకుంటున్నారు. ఈ పరిణామం వల్ల.. కొత్తగా వచ్చేది ఏమీ లేదని.. కానీ, పోయేది మాత్రం ఎక్కువగా ఉంటుందని.. అంటున్నారు. అప్పలరాజుకు తెలియకుండానే జిల్లాలో సొంత పార్టీలో శత్రువులు ఎక్కువ అవుతున్నారు. అది పక్కన పెడితే స్థానికంగా మంత్రిగా ఆయన పలాసలో తన ముద్ర వేయాలంటే స్థానిక సమస్యలను, నేతలను పట్టించుకుంటే ఆయనకు లోకల్ గౌరవం ఉంటుందని అంటున్నారు

## జీవీ శ్రీ రాజ్ అత్యుత్సాహంపై సెటైర్లు



కాకినాడ,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: జీవీ శ్రీ రాజ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మాత్రమే. అమలాపురం మాజీ ఎంపి హర్ష కుమార్ తనయుడు కావడం తప్ప ఆయనకంటూ వ్యక్తిగత గుర్తింపు వచ్చిన సందర్భాలు చాలా తక్కువ. లండన్ లో చదువుకుని రాజకీయాలపై ఆసక్తితో తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని తానేమిటో నిరూపించుకోవాలనే తపన శ్రీ రాజ్ లో చాలా ఉంది. ఈ క్రమంలో కొన్ని దూకుడు పనులు చేసి వివాదాల్లో చిక్కుకోవడం శ్రీ రాజ్ కు అలవాటుగా మారింది. ఒక్కోసారి శ్రీరాజ్ చేసే కార్యక్రమాలు తండ్రి హర్ష కుమార్ కు తలపోటుగా మారతాయనే ప్రచారం ఆయన ప్రత్యర్ధులు చేస్తూ ఉంటారు. తాజాగా శ్రీ రాజ్ ట్విట్టర్ కు వ్యతిరేకంగా చేపట్టిన వినూత్న నిరసన దేశవ్యాప్త చర్చకు కాంగ్రెస్ లో తెరతీసింది.సమైక్య ఆంధ్ర ఉద్యమ కారులు హర్ష కుమార్ కాలేజ్ పై దాడి కి పాల్పడినప్పుడు వారిని చితకొట్టి వార్తల్లో నిలిచాడు శ్రీ రాజ్. ఆ తరువాత రాష్ట్ర విభజన కు వ్యతిరేకంగా రాజమండ్రి విమానాశ్రయం కు వెళ్ళి విమానాలనే ఆపాలని చూశాడు హర్ష తనయుడు జీవీ శ్రీ రాజ్. నాడు మీడియా లో శ్రీ రాజ్ హై లైట్ అయ్యాడు. అయితే ఆ కేసు నుంచి బయటపడటానికి చాలా కాలమే పట్టింది. అదే విధంగా హర్ష కుమార్ ను జగన్ సర్కార్ న్యాయమూర్తి పై దూషణ కేసులో అరెస్ట్ చేసినప్పుడు ఎస్ ఐ రొటీన్ గా మాట్లాడిన మాటలను వీడియో రికార్డ్ చేసి వైరల్ గా మారింది. ఇలా సంచలనాలు సృష్టించే క్రమంలో శ్రీరాజ్ తాజాగా కాంగ్రెస్ అధినేత యువరాజు రాహుల్ గాంధీ దృష్టిలో నేరుగా చేసిన ప్రయత్నం వికటించి పార్టీనుంచి సస్పెండ్ కావాలిసి వచ్చింది.ఇటీవల రాహుల్ గాంధీ వర్సెస్ ట్విట్టర్ వార్ నడుస్తుంది. ఆయన ఖాతాను ట్విట్టర్ బ్యాన్ చేసింది. ఈ అంశంపై రాహుల్ గాంధీ వరకు తాను చేసిన కార్యక్రమం వెళ్ళాలి అని శ్రీ రాజ్ భావించాడు. వెంటనే కౌంజు పిట్టను తెచ్చి కాల్చి తన అనుచరులతో కలిసి తింటూ కొంత పక్షి మాంసం ట్విట్టర్ ఢిల్లీ హెడ్ క్వార్టర్ కి పోస్ట్ చేశాడు. ఇదంతా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశాడు శ్రీ రాజ్. ట్విట్టర్ తమ అధినేత కు చేసిన అవమానానికి నిరసనగా శ్రీ రాజ్ ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రకటించారు. అనుకున్నట్లే ప్రచారం లభించింది.అయితే ఈ కార్యక్రమం వివాదాస్పదం అయ్యింది. హర్ష కుమార్ వ్యతిరేక వర్గం పార్టీకి సంబంధం లేని కార్యక్రమాలు తో శ్రీ రాజ్ ఇబ్బంది పెడుతున్నట్లు కొందరు ఫిర్యాదు చేశారు. పక్షిని హింసించి కాల్చి తింటూ రాహుల్ గాంధీ కి చెడ్డపేరు తెస్తున్నారని ఫిర్యాదులు వెళ్ళడంతో చిత్రంగా ఈ వ్యవహారం పై అధిష్టానం సీరియస్ అయ్యింది. శ్రీ రాజ్ ను పార్టీ సస్పెండ్ చేసింది. తానొకటి తలిస్తే పార్టీ మరొకటి తలచిందని మదన పడ్డ శ్రీ రాజ్ సోనియా గాంధీ కి తానే తప్పు చేయలేదంటూ మరో వీడియో పంపి సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ వేడుకున్నారు. ఇదంతా ఎలా ఉన్నా ఇటీవలే కాంగ్రెస్ లో కుమారుడితో సహా చేరిన హర్ష కుమార్ కి ఎపి పిసిసి అధ్యక్షుడి పదవి ఖరారు అయ్యేలా ఉన్న తరుణంలో సన్ స్ట్రోక్ ఇబ్బందిగా మారింది.

## భారీగా పెరిగిన మిర్చి సాగు

గుంటూరు, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: టూరు జిల్లాలో రైతులు ప్రస్తుతం పత్తికి ప్రత్యామ్నాయంగా మిర్చి వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో, జిల్లాలో ఈ ఏడాది పత్తి విస్తీర్ణం గణనీయంగా తగ్గి, మిర్చి విస్తీర్ణం పెరగనుంది. జిల్లాలో 4.24 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 2.44 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఈ నెలాఖరుకు మరో లక్ష ఎకరాల్లో సాగవురతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి 3.60 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. పత్తి సాగుకు ఈ నెలాఖరు వరకు సమయం ఉందని అధికారులు తెలిపారు.మిర్చి సాధారణ సాగు 1.84 లక్షల ఎకరాలుగా అంచనా వేయగా ఈ ఏడాది ఇప్పటికే 2.50 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మిర్చి 44 వేల ఎకరాల్లో సాగైంది. మిర్చి సాగుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. పత్తికి గతేడాది ఆశించిన ధరలు రాకపోవడం, దిగుబడులు తగ్గడం, గులాబి పురుగు ప్రభావం, తెగుళ్లు, నకిలీలల బెడద ఇత్యాది కారణాల వల్ల ఈ ఏడాది రైతులు పత్తి సాగుకు కొంతమేరకు వెనుకంజ వేశారు. పత్తి సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు. కాయలు కాసి పత్తి చేతికి వచ్చే సమయంలో వర్షాలు రావడం, గులాబి పురుగు కాయలను తినేయడంతో మెట్ట ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో గతేడాది దిగుబడి గణనీయంగా తగ్గింది. పత్తి సాగులో తీవ్ర నష్టాలను చవిచూసిన రైతులు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండఢంతో మిర్చి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మిర్చి క్వింటాలు కనిష్ట ధర రూ.10 వేలకు తగ్గకుండా లభిస్తోంది. గరిష్టంగా 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. సీజన్‌లో గరిష్టంగా రూ.12 వేలు పలికినా సీజన్ పూర్తయిన తరువాత రూ.15 వేలకుపైగా వస్తుండడంతో మిర్చి వైపు రైతులు ఆసక్తిగా ఉన్నారు. మిర్చి సాగుకు పెట్టుబడి రూ.లక్ష వరకు అవుతున్నా ఎంతో కొంత ఆదాయం ఉంటుందని భావించిన పత్తి రైతులు పంట మార్పిడిలో భాగంగా ఈ ఏడాదికి మిర్చి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీరు పుష్కలంగా ఉండడంతో ఈ ఏడాది మిర్చి సాగుకు నీటి ఎద్దడి ఉండదని భావిస్తున్నారు.

# కావలి పాత్రికేయులకు విషాదకరం..



## జలదంకి ప్రభాకర్ మృతి జర్నలిష్టులకు తీరనిలోటు



కావలి ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: సీనియర్ పాత్రికేయులు జలదంకి ప్రభాకర్ మృతి కావలి పాత్రికేయులకు విషాధకరం అని సీనియర్ పాత్రికేయులు సిద్ది ప్రతాప్ రెడ్డి తెలిపారు. మంగళవారం జర్నలిస్ట్ క్లబ్ ,ప్రెస్ క్లబ్ పాత్రికేయులు ,డిఎస్పీ ప్రసాద్ ,రాజకీయ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సిద్ది ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కావలి తొలితరం పాత్రికేయులలో జలదంకి ప్రభాకర్ ఒకరని అన్నారు. ఆయన కలం పోరాట యోధుడు ,ఉపసంహరించుకోవడంలో కూడా యోధుడు అన్నారు.సంచాలనాత్మక కథనాలను ఆయన కలం పెట్టింది పేరు అన్నారు. జరగబోయే సంఘటనలను ముందుగా అంచనా వేసే నిజమైన జర్నలిజానికి అర్ధం చెప్పిన వ్యక్తి అని అన్నారు. ఆంధ్రపత్రిక విలేకరిగా ,స్ధాఫర్ గా ఉంటూ రాజకీయ కథనాలను అందించారని అన్నారు.ఇతర నది మాసపత్రిక ద్వారా సాహితి కార్యక్రమాలకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. 1992,94 లో కావలి పాత్రికేయులకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి అన్నారు. జర్నలిస్ట్ క్లబ్ ఏర్పాటు కు కీలకపాత్ర పోషించారని అన్నారు. ఏ రాజకీయ నాయకులు ,అధికార పార్టీ గాని మనలను ఫ్రెంట్ లైన్ వారియర్స్ గా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జలదంకి ప్రభాకర్ కరోనసోకి హాస్పిటల్స్ లో ఉంటే ఏ రాజకీయ నాయకులు ,అధికారులు కూడా పలకరించే దాఖలాలు లేవని చెప్పారు. ఇటీవల రాజకీయ నాయకుడు హాస్పిటల్ ఉంటే పది సార్లు సందర్శించారని ,బిల్లులు కూడా కట్టారని అన్నారు. పాత్రికేయులు క్రింద పడ్డ ఎవరు వచ్చే వారు లేరని , జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మనం వెళ్ళి రాయకపోతే ప్రపంచం ఆగిపోదని అనుకోవద్దు ,అవసరమైన వాళ్లే వచ్చి రాయించుకుంటారని అన్నారు.కరోన సమయంలో ఏ రాజకీయ నాయకుడు కూడా సహాయం కూడా అందించ లేదని అన్నారు. ముందు మన కుటుంబాలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.ఆయన లేని లోటు కావలి జర్నలిజానికి తీరనిలోటు అని అన్నారు.

## జాలిపూడి గ్రామ సభ

ఏలూరు ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు మండలం జాలిపూడి గ్రామంలో సర్పంచి వీధి నవ్య ఉప సర్పంచ్ దాసరి నరసింహారావు (బుజ్జి బ్బాయి) మరియు వార్డ్ నెంబర్లు అధ్యక్షు న జాలిపూడి గ్రామ సభ జరిగింది ఎయిర్టెల్ టవర్ పర్మిషన్ కోసం సచివాలయంలో గతంలో టవర్ పర్మిషన్ కోసం తీర్మానం కోరడమైనది గతంలో గ్రామ సభ సెల్ టవర్ కు తీర్మానం ఇచ్చి ఉన్నారు తర్వాత గ్రామస్తులందరూ ముక్తకంఠంతో మాకు టవర్ వద్దని వ్యతిరేకించండం జరిగింది మళ్లీ గ్రామస్తులందరూ టవర్ కడుతున్న యాజమాన్యం అడగ్గా మీరు తీర్మానం ఇచ్చారు కనుక టవరు కట్టడం ఆగదని చెప్పారు ఈరోజు జాలిపూడి గ్రామస్తులందరూ ఎయిర్టెల్ టవర్ వ్యతిరేకంగా గ్రామస్తులందరూ ఏకకంఠంతో మా ఊరికి టవర్ వద్దని జాలిపూడి గ్రామ మహిళలు భారీ ఎత్తున కదిలివచ్చి నిరసన తెలిపారు సంతకాల సేకరణ గ్రామ తీర్మానం చేయడం జరిగింది .....

## లోక్ ఆధాలత్ ను సద్వినియోగం చేసుకోండి..

కొత్తపేట, ప్రజా పాలన ప్రతినిధి రాజీపడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను లోక్ ఆధాలత్ ద్వారా పరిష్కరించుకోవడానికి సెప్టెంబర్ 11 వ తేదీన నేషనల్ లోక్ ఆధాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.భాస్కరరావు తెలిపారు.సివిల్,క్రిమినల్ చెక్కు కేసులు,ప్రామిసరీ నోట్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.కక్షిదారులు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్.భాస్కరరావు తెలియజేసారు.

## నల్ల మాడు తెగులుపై కొబ్బరి రైతులు అప్రమత్తంగా ఉండాలి..

కొత్తపేట,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: గత కొంతకాలంగా మండలంలోని నెల్లి వారి పేట లో సమారు 15 ఎకరాల్లో 900 కొబ్బరి చెట్లు హఠాత్తుగా చనిపోతున్నాయని ఉద్యానాధికారులను సంప్రదించడంతో చనిపోయిన కొబ్బరి చెట్లను అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించి మార్చి,ఎప్రియల్ నెలల్లో కొబ్బరి చెట్ల మరియు మట్టి యొక్క నమూనాలను సేకరించి పూణే,కేరళ లలో గల ప్రయోగశాలలకు పంపించినట్లు కొత్తపేట ఉద్యానాధికారి అమర్నాథ్ తెలిపారు.అక్కడ వాటిని పరిశోధన చేయగా నల్ల మాడు తెగులుగా గుర్తించారాని అన్నారు.ఈ వ్యాధి ఎక్కువ శాతం అరబ్ దేశాల్లో ఖార్జురం చెట్లకు వస్తుందన్నారు.ఈ వ్యాధి కొబ్బరి ఆకులు ఎండిపోయి రాలిపోవడం, మొవ్వు భాగం కుళ్ళిపోయి దుర్వాసన వస్తు రాలిపోతుందన్నారు.తెగులు వచ్చిన చెట్లను కాల్చివేయలని అన్నారు.టేబుకొనజోల్ 39%మందును 2 మీ.లీ ఒక లీటర్ నీటికి కలిపి 15 లీటర్ల ద్రావణాన్ని చెట్టు మొదలు పళ్ళాము చేసుకుని పోయడం ద్వారా లేదా 5 లీటర్ల ద్రావణాన్ని చెట్టు మోవ్వు తడిచేలా పోయటం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.ఈ తెగులు కోనసీమ ప్రాంతంలో తొలిసారిగా గుర్తించారని,ఈ తెగులుపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయని,రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..

## చందోలు లో పొలం-బడి కార్యక్రమం




చందోలు(పిట్టల వాని పాలెం), ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి మన్నవ నాగరాజు తెలిపారు.మంగళవారం మండలంలోని చందోలు రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ గౌరీ దేవీ విజయకుమారి మునీర్ అధ్యక్షతన పొలం-బడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ నాగరాజు మాట్లాడుతూ రైతులు పంటసాగులో పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించాలని సూచించారు.వరి పంట పైరు పై పురుగు మందులు విచ్చల విడిగా పిచికారి చెయ్యరాదని చెప్పారు.పురుగు మందులు పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విఏఏలు గుడారం కయ్య,శివ తేజస్విని , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు అండగా జగనన్న ప్రభుత్వం: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేటఅగస్ట్24ప్రజాపాలనప్రతినిధి:అగ్రిగోల్డ్ బాధితులకు




ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉద యభాను అన్నారు. మంగళవారం జగ్గయ్యపేట పట్ట ణంలోని మెప్మా కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితు లకు నగదు జమ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి గారి విగ్రహానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులబ్యాం కు ఖాతాల్లో రెండో విడత కింద రూ.20వేల లోపు 7 లక్షల మంది డిపాజిటర్ల ఖాతాల్లో రూ.666.84 కోట్ల నగదు జమ చేయడం జరిగిందన్నారు. ప్రైవేట్ సంస్థ బాధితులకు న్యాయం చేసిన దాఖలాలు దేశంలో ఎ క్కడా లేదన్నారు. పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా పని చేస్తోందని తెలియజేశారు.

## ఏపీ ఈఏపీసెట్ పరిక్షలకు 434 మంది విద్యార్థుల హాజరు




వేటపాలెం, ఆగష్టు 23 (ప్రజాపాలన ప్రతినిధి): ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి చీరాలలో మంగళవారం 434 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సులలో చేరడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రవేశ పరీక్షలను తమ కళాశాలలోని టిసిఎన్ అయాన్ సెంటర్లో ఆన్ లైన్ పద్ధతిలో నిర్వహి%శీ%చినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు మాట్లడుతూ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యములో జె.యన్.టి.యు కాకినాడ నిర్వహిస్తున్న కామన్ ఎంట్రన్స్ పరీక్షలు 25-8-2021 బుధవారము వరకు జరుగుతాయన్నారు. ఈఏపీసెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వారి తల్లితండ్రులకు పూర్తి సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం రెండు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షలకు ఉదయం 230 మంది విద్యార్థులకు గాను 217 మంది, సాయంత్రం 230 మంది విద్యార్థులకు గాను 217 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జె.యన్.టి.యు.కె చే నియమించిన ప్రొఫెసర్ ఎ గంగాధర్ పర్యవేక్షకులుగా వ్యవహరించారన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు, అంగన్వాడీ ఆయాలకు ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులు



నరసరావుపేట, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: :స్థానిక రెవెన్యూ డివిజన్ ఆఫీస్ నందు మంగళవారం అంగన్వాడీ ఆయాలకు టీచర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మనోరంజని మీడియా ద్వారా మాట్లాడుతూ నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో నాలుగు అంగన్వాడి ప్రాజెక్టులు ఉండటం జరిగిందని ఈపూరు




నాదెండ్ల నరసరావుపేట వినుకొండ ఈ నాలుగు ప్రాజెక్ట్ పరిధులలో 13 అంగన్వాడీ కార్యకర్త ల పోస్టులు 45 అంగన్వాడీ ఆయా పోస్టు లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డిఓ ఎమ్. శేషి రెడ్డి, డాక్టర్ బి రోహిణి రత్నశ్రీ డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ నరసరావుపేట శ్రీమతి ఎం అనూరాధ సి డి పి ఓ నరసరావుపేట, నాదెండ్ల సిడిపిఓ మాణిక్యరావు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ



కంచికచర్ల ఆగస్టు 24(ప్రజాపాలనప్రతినిధి)గతమూడు సంవత్సరాల నుంచి ఎంతో ఓపికతో తనకొచ్చేసంపాదనలో సగవంతు యర్రగొర్ల రామకృష్ణ (టీ స్టాల్) మతిస్థిమితం లేని యాచకులకు అన్నదానంచేయడం చాలా అభినందనీయమని స్థానిక ప్రజలు పేర్కొన్నారు మండల పరిధిలోని కీసర గ్రామంలోని జాతీయ ర హదారి పక్కన గల శ్రీ అమ్మా లోకేశ్వరి శివశంకర్ శి వాలయం ఆవరణంలో గత మూడు సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేని వారికి ఇల్లు గడవక షాపులు వద్ద బిచ్చమెత్తుకుంటున్న కొంతమంది వ్యక్తులకు ప్రతి రోజు అన్నదానం కార్యక్రమం ఘవిస్తున్నారు ఈ కార్యక్రమంపై పలువురు మాట్లాడుతూ గత రెండున్న ర సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వం లాక్డౌన్ విధిం చడంతో పనులు పలు వ్యాపారాలు కోల్పోయి క్లిష్ట ప రిస్థితుల్లో ప్రజలు జీవనం సాగిస్తుంటే ఇలాంటి కిష్ట ప రిస్థితుల్లో కూడా తాను చేస్తున్న వ్యాపారంలో తనకొ చ్చిన లాభంలో కొంత లేని వారికి ఖర్చు పెట్టడంచాలా గొప్ప విషయమని పలువురు కొనియాడారు అలాగే యర్రగొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కంచికచర్ల మం డ లం పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు మీ వంతు సహా య సహకారాలు అందించి ఈ అన్నదాన కార్యక్రమా నికి కృషి చేయాలని ఆయన కోరారు అంతే కాకుండా ఈ మధ్యకాలంలో చాలా మంది పుట్టిన రోజులు పు రస్కరించుకొని అనేక వృదా ఖర్చులు చేస్తున్నారు ఇ కనైనా ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలు పద్ధతులు మార్చు కుని మానవత్వం తో ప్రతి ఒక్కరూ పుట్టినరోజులు పెళ్లిరోజులు పురస్కరించుకొని ఆరోజు లేనివారికి వ స్తు రూపంలో సహాయాలు చేయాలని సూచించారు.



# ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 25, ఆగష్టు 2021


## నయా ఉదారవాద విధానాలను వదిలించుకునే దిశగా మెక్సికో

దేశాధ్యక్షుడిగా తన తొలి ప్రసంగం లోనే నయా ఉదారవాద విధానాలను ఒక 'విపత్తు'గా, ఒక 'దుర్ఘటన'గా పేర్కొన్నారు మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ ఓబ్రెడార్. ఆయన 'మొరెనా' అనే ఒక వామపక్ష పార్టీకి చెందినవాడు. ఆ పార్టీ తన కార్యక్రమంలో ఇలా పేర్కొంది: "నయా ఉదారవాద నమూనా వైఫల్యాన్ని ప్రపంచ ఆర్థిక సంక్షోభం బహిర్గతం చేస్తోంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు బలవంతంగా రుద్దిన విధానాలు మెక్సికో ను అతి తక్కువ వృద్ధి జరుగుతున్న దేశంగా చేశాయన్నది వాస్తవం." ఇందుకు బదులుగా మొరెనా పార్టీ "ప్రభుత్వమే బాధ్యత వహించి విదేశీ జోక్యం లేకుండా దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలి" అని ప్రతిపాదించింది.

ఈ దృక్పథంతో ఓబ్రెడార్ దేశ ఆర్థిక విధానాలలో పలు మార్పులను ప్రవేశపెడుతున్నారు. నయా ఉదారవాద విధానాలను విడనాడి ప్రభుత్వ నియంత్రణలో దేశ ఆర్థిక వ్యవస్థ నడిచే విధంగా ఈ మార్పులు ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలపాటు ఈ దేశాన్ని పాలించిన నాయకులు ఈ ప్రభుత్వ నియంత్రణలో దేశ ఆర్థిక వ్యవస్థ నడవడమనేది ఒక మహా పాపంగా పరిగణిస్తూ వచ్చారు. అందుచేత అటువంటి విధానాల వైపు తిరిగి దేశాన్ని నడిపిస్తున్నందుకు ఓబ్రెడార్ మీద పాశ్చాత్య మీడియా దాడి చేస్తోంది. అతని ఫోటోను మొదటి పేజీలో ప్రచురించిన లండన్ పత్రిక 'ది ఎకనామిస్ట్' దాని కింద 'మెక్సికో బూటకపు అవతార పురుషుడు' అన్న శీర్షిక పెట్టింది. నయా ఉదారవాద విధానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఎటువంటి చిక్కులలోకి దించాయో ఈ పాశ్చాత్య మీడియాకు బాగా తెలుసు. అందుచేత సంపన్న దేశాలు గనుక నయా ఉదారవాద విధానాలకు కాస్త దూరంగా జరిగితే, ఆ దేశాల పట్ల కాస్త ఎక్కువ సానుకూలంగా వ్యాఖ్యానిస్తాయి. అదే ఏ మూడవ ప్రపంచ దేశమైనా గనుక ఆ విధానాల నుండి కాస్త పక్కకు జరిగినా దానిపైన పెద్దపెట్టున విరుచుకు పడతాయి. ఇది కేవలం ద్వంద్వ వైఖరిని అనుసరించడం మాత్రమే కాదు. సామ్రాజ్యవాదం స్వభావం ఏమిటో తెలియజెప్పే ఉదాహరణ ఇది. ఎటువంటి ద్రవ్యోల్బణపు ప్రభావమూ లేకుండా సంపన్న దేశాల ఆర్థిక పరిస్థితి పుంజుకోవాలంటే అందుకు మూడవ ప్రపంచ దేశాల ప్రజల ఆదాయాలను తొక్కిపట్టి వుంచడం అవసరమని భావించడం దీనికి కారణం. దక్షిణాసియా దేశాలకన్నా, ఆఫ్రికా ఖండ దేశాలకన్నా మెక్సికో లో తలసరి ఆదాయం బాగా ఎక్కువ. ఐనా, ఆ దేశం మూడవ ప్రపంచ దేశాలలో భాగంగానే పరిగణించబడుతోంది. ఒక చమురు ఉత్పత్తి దేశం గనుక మూడవ ప్రపంచ దేశాలలో మెక్సికోకు గల ప్రాధాన్యత ఎక్కువే. నిజానికి ఓబ్రడార్ తెస్తున్న సంస్కరణలలో చమురు రంగానికి సంబంధించినవి ప్రత్యేక ప్రాధాన్యత కలిగినట్టివి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి చమురు రంగాన్ని మరింత ప్రైవేటీకరించాలని కోరుతోంది. కాని ఓబ్రడార్ ప్రభుత్వం అందుకు పూర్తి వ్యతిరేక దిశలో అడుగులు వేస్తోంది. అంటే, చమురు రంగాన్ని తిరిగి జాతీయం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. జాతీయ విద్యుదుత్పత్తి గ్రిడ్ తనకు కావలసిన చమురును ప్రైవేటు ఆయిల్ కంపెనీల నుండి కాకుండా, ముందు ప్రభుత్వ అధీనంలో నడిచే 'పెమెక్స్' కంపెనీ నుండి మాత్రమే తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఆదేశించింది. దేశంలో చమురు నిక్షేపాలను గుర్తించి వెలికి తీసే హక్కుల కోసం ప్రధానంగా విదేశీ కంపెనీలు దరఖాస్తులు చేసుకున్నాయి. ఆ బిడ్డింగ్ ప్రక్రియను ఓబ్రడార్ నిలిపివేశాడు. స్వదేశీ చమురు శుద్ధి సంస్థల సామర్ధ్యాన్ని పెంచడం కోసం పెట్టుబడులు పెట్టవలసిన అవసరం ఉన్నప్పటికీ, మెక్సికో ప్రభుత్వం గత నాలుగు దశాబ్దాలుగా అందుకు పెట్టుబడులు పెట్టలేదు. దానికి బదులు ముడి చమురును అమెరికా కు పంపుతూ వచ్చింది. ఇప్పుడు ఓబ్రడార్ ప్రభుత్వం దేశంలో చమురు శుద్ధి సామర్థ్యాన్ని అదనంగా పెంచడానికి గాను ప్రభుత్వ సంస్థ అయిన పెమెక్స్ కు ఆర్థికంగా పెట్టుబడులు సమకూర్చి అదనపు చమురు శుద్ధి యూనిట్లను నెలకొల్పేటందుకు ప్రోత్సహిస్తున్నది. ఆ విధంగా చమురు నిల్వల అన్వేషణతో ప్రారంభించి, దానిని వెలికి తీయడంతో బాటు, దానిని శుద్ధి చేసేవర కూ అన్ని దశలలోనూ ప్రభుత్వ జోక్యం ఉండేలా, విదేశీ ప్రైవేటు సంస్థల పాత్రను కత్తిరిస్తున్నాడు ఓబ్రడార్. దీనివలన దేశానికి ముఖ్యమైన ఆర్థిక ప్రయోజనాలు కూడా కలుగుతాయి. పెమెక్స్ కంపెనీకి వచ్చే లాభాలు ప్రభుత్వానికి చెందుతాయి. ఆ కంపెనీ ఎంత చిన్నదిగా ఉంటే లాభాలు అంత తక్కువగా వస్తాయి. అప్పుడు తనకు కావలసిన ఆర్థిక వనరుల కోసం మెక్సికో ప్రభుత్వం ఇతర వనరులపైన అంత ఎక్కువగా ఆధారపడవలసి వస్తుంది. అటువంటి ఇతర వనరుల్లో పెట్రో ఉత్పత్తులపైన వసూలు చేసే పన్నులు ముఖ్యమైనవి. అందుచేత పెట్రో పన్నులను ఆ ప్రభుత్వం అదనంగా పెంచవలసి వస్తుంది (మన దేశంలో మోడీ ప్రభుత్వం సరిగ్గా ఇదే చేస్తోందిప్పుడు). చమురు ఉత్పత్తిలో ఒక ముఖ్యమైన స్థానం మెక్సికో కు ఉంది. 2019లో ప్రపంచ చమురు ఉత్పత్తిలో 2 శాతం ఒక్క మెక్సికో లోనే జరిగింది. కాని మొత్తం ఉత్తర అమెరికా ఖండంలోనే చూసుకుంటే అత్యధిక పెట్రో ధరలు మెక్సికో లోనే ఉన్నాయి. అందుకే ఓబ్రడార్ చాలా కాలం నుండీ అధిక పెట్రో ఉత్పత్తులను వ్యతిరేకిస్తూ వచ్చాడు. ఇప్పుడు ప్రభుత్వ రంగ చమురు వ్యవస్థను బలోపేతం చేయడం ఆ కారణంగానే జరుగుతోంది. మెక్సికో నయా ఉదారవాద విధానాల నుండి వైదొలగినది కేవలం చమురు రంగం లోనే కాదు. విదేశీ కంపెనీలకు, ముఖ్యంగా కెనడా దేశపు కంపెనీలకు ఇచ్చిన మైనింగ్ లీజులను నిలుపు చేశారు. మెక్సికో లోని లిథియం నిల్వలను జాతీయం చేసే పథకాన్ని రూపొందిస్తున్నారు. దేశం లోని సహజ వనరుల మీద తిరిగి నియంత్రణ సాధించడంతోబాటు ఓబ్రడార్ ప్రభుత్వం మెక్సికో కేంద్ర బ్యాంకు మీద కూడా నియంత్రణ సాధించడం కోసం ప్లాను చేస్తోంది. ఈ కేంద్ర బ్యాంకు గవర్నర్ ను సాధారణంగా ప్రభుత్వమే నియమిస్తుంది. ఐతే, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఆమోదయోగ్యమైనవారినే ఇంతవరకూ నియమిస్తూ వచ్చారు. అలా వచ్చిన వారంతా దేశ ఆర్థిక వృద్ధి కన్నా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికే హెచ్చు ప్రాధాన్యతను ఇస్తూ వచ్చారు. ఈ విధంగా చేయడాన్ని విమర్శిస్తున్నానంటే ద్రవ్యోల్బణాన్ని పట్టించుకోకూడదని మాత్రం కాదు సుమా. వృద్ధికి అవసరమైన వ్యయాన్ని కూడా అనుమతించని ద్రవ్య విధానాన్ని అనుసరించే బదులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలని దానర్థం.

## అమ్మకానికి మరో పేరు

ఇది అమ్మకం ఎంత మాత్రం కాదు, ఆస్తుల్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవడం మాత్రమే అంటూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) ప్రణాళిక ప్రకటించారు. రాబోయే నాలుగేళ్ళ కాలంలో ఆరులక్షలకోట్లు సమీకరించడం లక్ష్యంగా, అత్యంత కీలకమైన రంగాల్లోని ఆస్తిపాస్తులను కేంద్రం ఇందుకు ఎంచుకున్నది. విద్యుత్, రోడ్లు, రైళ్ళు, విమానాశ్రయాలు, క్రీడామైదానాలు ఇలా అవీ ఇవీ అని కాకుండా దాదాపు అన్ని రంగాల ఆస్తులూ ఇందులో ఉన్నాయి. ఆస్తులపై యాజమాన్యహక్కులు ప్రభుత్వానికే ఉంటాయనీ, నిర్దేశిత కాలం తర్వాత సదరు ప్రైవేటు భాగస్వామి వాటిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడం తప్పనిసరి అని కూడా ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. వినియోగంలో లేని లేదా గరిష్టంగా వినియోగించుకోని ఆస్తులను మాత్రమే ఇందుకు ఎంపికచేశామన్నారు. మొన్నటి బడ్జెట్‌లోనే ఆర్థికమంత్రి ఈ పథకాన్ని ప్రస్తావించినా, బహుశా దాని లోతుపాతులు, పరమార్థాలు సరిగా చెవికెక్కనందుకో ఏమో విపక్షాలనుంచి బలమైన ఎదురుదాడి లేకపోయింది. ఇప్పుడు కొందరు ఆర్థికవేత్తలు మాత్రం ఈ పథకం ద్వారా ప్రభుత్వానికి కలిగే ప్రయోజనంపై అనుమానాలు వ్యక్తంచేస్తుంటే, దీనివెనుక కనిపించని మాయ ఏదో ఉన్నదని మరికొందరి వాదన. ఆస్తులను అమ్మేది లేదు, తిరిగి కచ్చితంగా వెనక్కుతీసుకుంటామని నిర్మల చెబుతున్నా అత్యధికులకు ఆ నమ్మకం కలగడం లేదు. ఒక ఆస్తిని సుదీర్ఘకాలం అనుభవించేందుకు వీలుగా అధికారాలు పొంది, దానిని అభివృద్ధి చేసిన తరువాత, ప్రభుత్వం ఇచ్చినదానిని వెనక్కు ఇచ్చేయడం జరిగే పనేనా? అన్నది ప్రశ్న. సర్వసాధారణంగా ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు చేతుల్లోకి పోవడమే తప్ప తిరిగి రావడం కనిపించదు. పైగా, గరిష్టస్థాయిలో సద్వినియోగం చేసే క్రమంలో సదరు ప్రైవేటు యజమాని బ్యాంకు రుణాలు తీసుకుంటాడు, పెట్టుబడులు పెడతాడు. ప్రభుత్వానికి ఎంతో కొంత ముట్టచెబుతూ, వాటిని మరింత విలువైన ఆస్తిపాస్తులుగా మార్చి, ఎక్కువే పిండుకుంటాడు. ఆ తరువాత కూడా వాటిని తిరిగి అప్పగించడానికి కాక, అనుభవించడానికే ప్రయత్నం జరుగుతుంది. ప్రభుత్వ%--% ప్రైవేటు భాగస్వామ్యం వంటి అందమైన పేర్లు పెట్టిన పథకాల్లో అంతిమంగా జరిగేది ప్రైవేటుకు ప్రభుత్వం తన వాటాలు వదిలేయడమే. అభివృద్ధి%--%నిర్వహణ%--% బదిలీ అనే మూడుదశల్లో ఆఖరుది ఏ ప్రాజెక్టులోనూ కనిపించదు. యాభై అరవైయేళ్ళపాటు ఒక ప్రాజెక్టునుంచి ప్రైవేటుపెట్టుబడిదారుడు లాభాన్ని పూర్తిగా జుర్రుకున్నాక కూడా ప్రభుత్వం ఆ ప్రాజెక్టును తీసుకోవడం సర్వసాధారణంగా జరగదు. కార్పొరేట్లకూ, కుబేరులకూ ప్రజల ఆస్తులను అప్పగించడానికి ప్రభుత్వాల దగ్గర చాలా మార్గాలుంటాయి, నేతల దగ్గర సామాన్యుడికి అర్థంకాని ఆర్థికపరిభాష ఉంటుంది. వేలకోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ ప్రైవేటువ్యక్తులకు అప్పగించడం, ప్రైవేటురంగం వినియోగదారులను దోచేయడం ఎప్పటినుంచో జరుగుతున్న విన్యాసమే. ఈ వనరుల గరిష్టస్థాయి వినియోగం ద్వారా సమకూరినదానిని కూడా తిరిగి మౌలిక సదుపాయాల కల్పనకే వెచ్చిస్తామని అంటున్నారు. ఇదో విషవలయం. బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులను పద్దుపుస్తకాల్లోంచి చెరిపేస్తున్న పాలకులు ప్రభుత్వరంగ ఆస్తుల గరిష్టవినియోగానికి మాత్రం సిద్ధపడుతున్నారు. ఈ తరహా ప్రతిపాదనల్లో అటు ప్రజలూ ఇటు ప్రభుత్వమూ ప్రయోజనం పొందాలి కానీ, అత్యధిక లబ్ధి పొందుతున్నది మాత్రం వేరొకరు. 'దీపం' అని పేరుపెట్టుకొన్న పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం అంతిమంగా చేస్తున్నదల్లా వాటిని అప్పగించడమో, అమ్మేయడమో. కరోనా కాలంలోనూ అన్ని అవాంతరాలనూ దాటి పది ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాన్ని ఈ ఏడాది ఆఖరుకల్లా పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆ విభాగం కార్యదర్శి ఇటీవలే పారిశ్రామికవేత్తల సదస్సులో చెప్పుకొస్తూ ఈ ఆరులక్షలకోట్ల ఎన్ఎంపీని కూడా ఘనంగా ప్రస్తావించారు. ప్రజల ఆస్తులు ఎక్కడికీ పోవు, బడాపారిశ్రామికవేత్తల చేతుల్లో మెరుపునూ, విలువనూ సంతరించుకొని మళ్ళీ వెనక్కువచ్చేస్తాయన్న పాలకుల పలుకులు ఎందుకో నమ్మశక్యంగా లేవు.

## స్వయం పోషకత్వమే ఆర్థిక సార్వభౌమత్వం




విదేశీ సరుకుల వెల్లువ మన ఆర్థిక వ్యవస్థను కుదిపివేస్తోంది. ముఖ్యంగా చైనా నుంచి చౌకవస్తువుల దిగుమతులు మన జాతీయభద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. ఈ కారణంగా అనేక చైనా యాప్స్‌ను మన ప్రభుత్వం నిషేధించింది. వందకు పైగా రక్షణ పరికరాల దిగుమతిని నిలిపివేసింది. ఆభరణాలు, ప్లాస్టిక్స్, రసాయనాలు, చర్మ ఉత్పత్తులతో సహా పలు ఎంపిక చేసిన వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచింది. అధిక వ్యయ దేశీయ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలా లేక స్వల్ప వ్యయ దిగుమతులను వినియోగించుకోవాలా అన్నది మన ముందున్న ప్రశ్న. అధిక వ్యయ దేశీయ ఉత్పత్తులకు మద్దతునివ్వడాన్ని సంరక్షణవాద (భారీ దిగుమతి సుంకాలు విధించడం ద్వారా విదేశీ వస్తువుల పోటీ నుంచి మన పరిశ్రమలకు రక్షణ కల్పించడం) విధానం అంటారు. స్వయం పోషకత్వాన్ని ప్రోత్సహించే సంరక్షణ విధానాలు దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడతాయనడంపై ఎవరికీ మరో అభిప్రాయం లేదు. అయితే చైనా యాప్‌లపై నిషేధం మొదలైన చర్యలు సరైన దిశలో తీసుకున్నవే అయినప్పటికీ అవే సరిపోవు. ఇంకా పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంగా సంరక్షణ విధానాలకు వ్యతిరేకంగా ఉన్న వాదనలను నిశితంగా పరిశీలిద్దాం. ప్రతి దేశమూ తాను చౌకగా ఉత్పత్తి చేయగల వాటిపై దృష్టిని కేంద్రీకరించాలి, ఇతర దేశాలు చౌకగా ఉత్పత్తిచేసే సరుకులను దిగుమతి చేసుకోవాలి– ఇదీ సంరక్షణ వాదానికి వ్యతిరేకంగా చేసే ప్రధాన వాదన. ఈ వాదనలోని తర్కం మౌలికంగా సరైనదే. అయితే దాని రెండు అనుషంగిక ప్రభావాలను మనం విస్మరించకూడదు. ఒకటి– దిగుమతులకు ప్రాధాన్యమిచ్చినప్పుడు ఆర్థిక పరాధీనత మూల్యాన్ని మనం భరించవలసి ఉంటుంది. ఒక కారును కొన్నప్పుడు దాన్ని బీమా చేయిస్తాం. అందుకు అయ్యే వ్యయాన్ని మనమే చెల్లిస్తాం. బీమా వ్యయాన్ని కారు కొనుగోలు ధరకు కలిపివేస్తాం. అదే విధంగా ఆర్థిక పరాధీనత మూల్యాలను దిగుమతుల ఖర్చులో కలిపివేయాలి. ఏమిటా మూల్యాలు? ఉదాహరణకు చైనానుంచి చౌక ఉక్కును దిగుమతి చేసుకుంటామనుకోండి. ఉక్కు కోసం మనం పూర్తిగా చైనాపై ఆధారపడతాం. అయితే యుద్ధం సంభవించినప్పుడు మనకు అవసరమైన ఉక్కు మనకు అందుబాటులో ఉండదు. దానిని ఉత్పత్తి చేసుకోగల సామర్థ్యమూ మనకు ఉండదు. ఇది కేవలం ఆర్థికపరమైన నష్టమే కాదు జాతి నవనాడులనూ కుంగదీసే నష్టం. ఇటువంటి చిక్కుల పాలవకుండా మనలను మనం కాపాడుకోవాలి. 'అవసరమైన సరుకులను, సౌకర్యవంతంగా సుసాధ్యమయినప్పుడు స్వదేశంలోనే ఉత్పత్తి చేసుకోవడం అన్ని విధాల శ్రేయస్కరమని ఆర్థిక వేత్త కీన్స్ అన్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజల నిత్య జీవితానికి ముఖ్యమైన, అనివార్యమైన వస్తువుల ఉత్పత్తిలో స్వావలంబన అత్యంత అవసరం. అంతగా ముఖ్యంకాని వస్తువులకు విదేశీ వాణిజ్యంపై ఆధారపడవచ్చు. అంటే దిగుమతలు ద్వారా వాటి అవసరాలను తీర్చుకోవచ్చు. దేశీయఉత్పత్తి కార్యకలాపాలే మన సాంకేతికతా సామర్థ్యాలకు పునాదులు అనే మౌలికవాస్తవం నిరక్ష్యానికి గురవడమనేది ఆర్థిక పరాధీనత రెండో అనుషంగిక ప్రభావం. మనం మన సొంత పారిశ్రామిక ఉక్కును తయారుచేసుకోగలిగితే వంతెనలు, ఫిరంగులు, ట్యాంకులు, ఉపగ్రహాలు మొదలైన వాటిని సొంతగా తయారు చేసుకోగలుగుతాం. మన ఆటోమొబైల్ పరిశ్రమకు అవసరమైన పారిశ్రామిక ఉక్కును తయారు చేసుకోలేనప్పుడు ప్రత్యేక ఉపయోగాలకు అవసరమైన ఉక్కును కూడా తయారుచేసుకోలేము. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనం సొంత ఉక్కును ఉత్పత్తి చేసుకోగలిగినప్పుడే అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో పురోగతికి పటిష్ఠపునాదులు నిర్మించుకోగలుగుతాం. చెప్పవచ్చినదేమిటంటే విదేశీ వాణిజ్యానికి సానుకూలంగా చేసే వాదనలు సమర్థించలేనివి. ఆర్థిక పరాధీనత వల్ల ఎదురయ్యే చిక్కులను, నవీన సాంకేతికతల రూపకల్పన, అభివృద్ధి సామర్థ్యం కొరవడడం అనే వాస్తవాలను ఆ వాదనలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. స్వతంత్ర భారతదేశం తొలి నాలుగు దశాబ్దాల పాటు దేశీయపరిశ్రమల సంరక్షణకే అధిక ప్రాధాన్యమిచ్చినప్పటికీ ఆర్థిక స్వావలంబన సాధనలో మనం పూర్తిగా ఎందుకు వెనుకబడిపోయాం? ఇది, సంరక్షణా విధానాలను వ్యతిరేకించే వారి మరో ప్రధాన వాదన. ప్రభుత్వ రంగ పరిశ్రమల ద్వారా పారిశ్రామికాభివృద్ధి సాధించాలన్న విధానానికి ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అగ్రప్రాధాన్యమిచ్చిన విషయం నిజమే. అయితే నెహ్రూ, ఆయన అనంతరం దేశాన్ని పాలించిన వారు రెండు పొరపాట్లు చేశారు. ప్రభుత్వరంగ సంస్థలకు నేతృత్వం వహించిన ఉన్నతాధికారులు, రాజకీయవేత్తలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడడంలో నెహ్రూ, ఆయన వారసులు విఫలమయ్యారు. తత్ఫలితంగా ఆ సంస్థలు ఆశ్రితపక్షపాతం, అసమర్థతకు నెలవులుగా పరిణమించాయి. అంతేకాదు, ఆర్థిక పురోగతికి జీవ ధాతువు అయిన పోటీని అణచివేశాయి. దేశీయ పరిశ్రమల మధ్య పోటీ అనేది లేకుండా చేశాయి . ఉదాహరణకు చిన్నకారుల రంగాన్ని చూడండి. 1980దశకం వరకు మనదేశంలో కేవలం రెండే రెండు చిన్న కార్లు తయారవుతుండేవి. బిర్లా, వాల్‌చంద్ కంపెనీలు వాటి ఉత్పత్తిదారులు. చిన్నకార్లపై దిగుమతి సుంకాలు చాలా హెచ్చుస్థాయిలో ఉండేవి. కనుక ఆ రెండు ఆటోమొబైల్ సంస్థలకు పోటీ అనేది ఉండేది కాదు. పోటీ ముప్పు లేక పోవడంతో నాసిరకం కార్లను ఉత్పత్తి చేసి అవి అధిక లాభాలకు అమ్ముకోగలిగాయి. మరో ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం టాటా కంపెనీ చిన్నకార్ల ఉత్పత్తికి లైసెన్స్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వడానికి మన పాలకులు ససేమిరా అన్నారు. మారుతీ కార్ల కంపెనీని సంజయ్ గాంధీ ప్రారంభించేంతవరకు బిర్లా, వాల్‌చంద్ కంపెనీలే చిన్నకార్ల రంగంలో రాజ్యమేలాయి. చిన్నకార్ల ఉత్పత్తిలో అసమర్థత అనేది సంరక్షణ విధానాల ఫలితం కాదనేది దీనివల్ల స్పష్టమవుతోంది. పోటీ కొరవడడంతో పాటు సంరక్షణ విధానాలు ఆటోమొబైల్ రంగంలో అభివృద్ధిరాహిత్యానికి దారితీశాయి. ఆహారం తీసుకోకుండా యాంటీ బయోటిక్స్ తీసుకోవడం హానికరం కాదూ? అలాగే పోటీ అనేది లేకుండా సంరక్షణ విధానాలను అనుసరించడం కూడా అటువంటిదేనని రుజువయింది. సంరక్షణ విధానాల వ్యతిరేకవాదనలు నిలిచేవి కావు. ప్రస్తుత పరిస్థితుల్లో దిగుమతి సుంకాలను రెండురెట్లు పెంచే విషయాన్ని ప్రభుత్వం చురుగ్గా పరిగణనలోకి తీసుకోవాలి. దిగుమతి సుంకాలను పెంచడంతో పాటు ఆటోమెటిక్ మెషీన్స్‌తో ఉత్పత్తి కార్యకలాపాలను సాగించే ఫ్యాక్టరీలపై అధిక పన్నులు విధించి తీరాలి. దీనివల్ల ఉద్యోగితను సృష్టించే చిన్న పరిశ్రమలు మనుగడ, అభివృద్ధికి విశేషంగా తోడ్పడతాయి. అదే సమయంలో దేశీయ పరిశ్రమల మధ్య పోటీని ఇతోధికంగా పెంపొందించేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. పోటీ ఉన్నప్పుడు మాత్రమే పరిశ్రమలు విశేషంగా పురోగమించగలుగుతాయనేది ఒక నిరూపిత సత్యం. ప్రస్తుతం విదేశీవాణిజ్యానికి అనుకూల వాదనలు అంతకంతకూ ఉద్ధృతమవుతున్నాయి. ప్రపంచం ఒక కుగ్రామంగా పరిణమించిన కాలంలో గిరిగీసుకుని కూర్చోవడం మంచిది కాదని విదేశీవాణిజ్య సమర్థకులు వాదిస్తున్నారు. ఈ వాదనలు చేస్తున్నది ఎవరు? విశ్వవిద్యాలయ ఆచార్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయవేత్తలు. ఈ పెద్దమనుషుల కుమారులు, కుమార్తెలలో అత్యధికులు బహుళజాతి సంస్థలు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మొదలైన వాటిలో ఉద్యోగాలు చేస్తున్నవారే కావడం గమనార్హం. విదేశీవాణిజ్యం వర్ధిల్లడమే తమ ప్రయోజనాలకు శ్రీరామరక్ష అని వారు విశ్వసిస్తున్నారు. దేశీయ పరిశ్రమలు సృష్టించే ఉద్యోగాలు వారికి ఏ మాత్రం అవసరం లేదు. తమ వ్యక్తిగత ప్రయోజనాలు విదేశీవాణిజ్యం మాత్రమే నెరవేర్చగలదని వారు నమ్ముతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ముందున్న సవాల్ చైనీస్ దిగుమతుల వెల్లువను ఎలా నిరోధించాలన్నది కాదు. దేశంలో ప్రభావశీలంగా వ్యవహరిస్తున్న విదేశీవాణిజ్య అనుకూల లాబీవర్గాలను ఎలా ఎదుర్కోవాలన్నదే మన పాలకులు ముందున్న అసలు సమస్య.

# దళిత, బిసి సంక్షేమం విరాజిల్లుతోంది !!

మచిలీవట్నం,ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో దళిత, వెనకబడిన తరగతుల సంక్షేమం విరాజిల్లుతోంది. బందరు నియోజకవర్గ చరిత్రలో సామాజిక న్యాయం, పేద ప్రజల అభ్యున్నతి, వారి స్థితిగతులు మార్చాలని చాలామంది నేతలు ఎన్నికల ప్రచారంలో మాత్రమే పెద్ద పెద్ద మాటలు గతంలో కొందర మాట్లాడారు. మచిలీవట్నం నియోజవర్గం లో 26 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం, 550 కోట్ల రూపాయలతో వైద్య కళాశాలలో నిర్మాణ పనులు ప్రారంభమవడం, 350 కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, సముద్ర మొగలో భారీ తవ్వ ఓడలతో పూడిక తీయించడం, నేడో రేపో ప్రారంభం కానున్న మచిలీపట్నం పోర్టు నిర్మాణం పనులు ఇవన్నీ ఒకవైపు చకచకా జరిగిపోతున్నాయి.. సోమవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ గా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు.. సీనియర్ న్యాయవాది మారుమూడి విక్టర్ ప్రసాద్ ఎంపిక కావడం పలువురుని సంభ్రమాశ్చర్యాలలో మునిగితేలేలా చేసింది.. గత 40 ఏళ్లుగా దళిత ఉద్యమంలో ఆయన ఎంతో చురుకైన పాత్ర పోషించారు. నిమ్న వర్గాలకు తిరుగులేని నాయకుడుగా స్వయంప్రకాశ శక్తితో పైకెదిగిన మారుమూడి విక్టర్ ప్రసాద్ తన సుదీర్ఘ దళిత ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకొని మంత్రి పేర్ని నానికి ఒక నమ్మకమైన సోదరుడి మాదిరిగా వ్యవహరించారు. వైయుస్సార్ పార్టీని తనను నమ్ముకున్న వారికి న్యాయం చేసే వరకు విశ్రమించని తత్వమున్న మంత్రి పేర్ని నాని ఎస్సీ సెల్ చైర్మన్ గా మారుమూడి ప్రసాద్ ఎంపిక కావడానికి ప్రధాన భూమిక పోషించారన్నది అక్షర సత్యం. ఎంతో కీలకమైన ఆ నామినేటెడ్ పోస్టు మచిలీపట్నం వానికి దక్కడం మచిలీపట్నం చరిత్రలో సువర్ణ అక్షరాలతో రాయదగ్గ అంశం. కుహనా రాజకీయ నాయకులు ఎంత విమర్శించినా వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లో పేదల స్థితిగతులు మెరుగు పడుతున్నాయి. బడుగు, వెనకబడిన తరగతుల ప్రజలకు రాజకీయ గౌరవం మన రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) నేతృత్వంలో విరాజిల్లుతోంది. దళితులు, బహుజనులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఇంకా చేస్తామంటున్నారు. కార్పొరేషన్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ మహానేతగా వైయస్ జగన్ ప్రజల్లో గుర్తింపు పొందారు. ఆయన అడుగుజాడల్లో మంత్రి పేర్ని నాని నడుస్తూ పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి పదవులు కట్టబెడుతున్నారు. బాబా సాహెబ్ ఆలోచన విధానం మచిలీపట్నం నియోజవర్గంలో నేడు



కొనసాగుతోంది. మంచి ఆలోచనతో సాగుతున్న పాలనలో మేం భాగస్వాములం అయినందుకు సంతోషంగా ఉందనీ పలువురు దళిత, బహుజన, వెనకబడిన తరగతుల ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## పందిళ్లపల్లి చౌకధరల దుకాణదారుని పై 6ఏ కేసు నమోదు

వేటపాలెం, ఆగష్టు 24 (ప్రజాపాలన ప్రతినిధి): స్థానికులు అందించిన సమాచారం మేరకు మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలోని చౌకధరల దుకాణం నెంబర్ 13ను స్థానిక తహశీల్దార్ కె. సంధ్యశ్రీ సోమవారం సాయంత్రం అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ చౌకధరల దుకాణం తెరవటం లేదనే సమాచారంతో తనిఖీ కి వెళ్లినట్లు, షాపు పాత చిరునామాలో తొలగించి వేరే చోట ప్రారంభించినట్లు గుర్తించి షాపుకు వెళ్లి రికార్డులను పరిశీలించగా బౌతికంగా దుకాణంలో ఉన్న నిల్వలో తేడాను గమనించినట్లు తెలిపారు. 25 బస్తాల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి దుకాణాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఐ ప్రసన్న, విఆర్ఓలు మునీర్, సదానందరావు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఉంది నకిలీ తెలుగుదేశం పార్టీ

## అగ్రిగోల్డ్ స్కాంకు కర్త, కర్మ, క్రియ గత చంద్రబాబు ప్రభుత్వమే

## పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు జగన్మోహన్ రెడ్డి బాసటగా నిలిచారు

## గుడ్ మార్నింగ్ విజయవాడ సెంట్రల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో ఉన్నది నకిలీ తెలుగుదేశం పార్టీ అని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు అన్నారు. గుడ్ మార్నింగ్ విజయవాడ సెంట్రల్ కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్ లోని భగత్ సింగ్ నగర్ రోడ్డు, పెనుమత్స వారి వీధి, వానపల్లి వారి వీధులలో స్థానిక కార్పొరేటర్ శ్రీమతి పెనుమత్స శిరీష సత్యం గారితో కలిసి ఆయన పర్యటించారు. అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. ముత్యాలంపాడు దోబీఘాట్ ను పరిశీలించిన ఆయన.. అక్కడి పరసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకముందే పరిసరాలను పరిశుభ్రపరచాలన్నారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతన పాలనను అందించడంలో భాగంగా చేపట్టిన గుడ్ మార్నింగ్ విజయవాడ కార్యక్రమాన్ని విమర్శించే వారికి ప్రజాక్షేత్రంలో ఉండే నైతిక అర్హత లేదని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఆర్థిక నేరాల ద్వారా మోసపోయిన ప్రజలను ఆదుకున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని



చెప్పుకొచ్చారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 10.40 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 905.57 కోట్లు నేరుగా వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. సీఐడీ, వాలంటీర్ల వ్యవస్థల సమన్వయంతో పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. గత తెలుగుదేశం హయాంలో అగ్రిగోల్డ్ ఆస్తులను కాజేసేందుకు చంద్రబాబు అండ్ కో కుట్రలు పన్నిందన్నారు. వాటిని సాక్ష్యాధారాలతో సహా అసెంబ్లీలో చూపించామన్నారు. అగ్రిగోల్డ్ అక్రమాలకు కర్త, కర్మ, క్రియ ముమ్మాటికీ చంద్రబాబునాయుడేనని మల్లాది విష్ణు విమర్శించారు. ఆయన హయాంలోనే అగ్రిగోల్డ్ కనీసం సెబీ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఐదేళ్ల పాటు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఎన్నికలకు కేవలం 2 నెలల ముందు ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు ఫిబ్రవరి 17, 2019న జీఓ ఇచ్చారన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం న్యాయస్థానం పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం కూడా బాధపడకూడదని మానవీయ కోణంలో ఆలోచించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని మల్లాది విష్ణు అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలబడటమే ఇందుకు నిదర్శనమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకున్న రోజుగా నేడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మరోవైపు పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి పార్టీ నుంచి చంద్రబాబునాయుడు గెంటేసిన రోజు కూడా ఇదే రోజని మల్లాది విష్ణు గుర్తుచేశారు. వెన్నుపోటుకు పేటెంట్ రైట్స్ పొందిన రోజైనా చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టే ప్రజారంజక కార్యక్రమాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్న ఈ నకిలీ తెలుగుదేశం పార్టీని రాజకీయాల నుంచి తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అనూష అనే మహిళకు మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డును ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాజు, వీఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ గురునాథం, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతపూడి చిన్నా, పట్టాభి, వెంకటేశ్వరరావు, అంగిరేకుల విజయ్, అంగిరేకుల సాయి, బెజ్జం రవి, వీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి: మైలవరం ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం ,ప్రజాపాలన ప్రతినిధి:అగ్రిగోల్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. అగ్రిగోల్డ్ లో డిపాజిట్ చేసి మోసపోయిన బాధితులు ఏ ఒక్కరూ మానసిక క్షోభకు గురికాకూడదని... పాదయాత్రలో, మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం డిపాజిట్ దారులకు చెల్లింపులు చేస్తూ జగనన్న భరోసా ఇస్తున్నారన్నారు. ఇప్పటికే రూ. 10 వేల లోపు డిపాజిట్ చేసిన వారికి చెల్లింపులు చేసిన సీఎం తాజాగా రూ. 20 వేల లోపు డిపాజిటర్లకు న్యాయం చేస్తున్నారని చెప్పారు. మంగళవారం ఏడు లక్షల పైచిలుకు డిపాజిటర్లకు రూ. 666.84 కోట్ల చెల్లింపుతో ఇప్పటి వరకు రూ. 20 వేల వరకు డిపాజిట్ చేసిన మొత్తం 10.40 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు మొత్తం రూ. 905.57 కోట్లు అందించిందన్నారు. ఇది పేదల మేలు కోరే మనసున్న మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే కొనియాడారు.

## కోటికలపూడి గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు



ఇబ్రహీంపట్నం , ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని కొటికలపూడిలో సర్పంచ్ రెంటపల్లి నాగరాజు (డాన్) మంగళవారం పారిశుధ్య చర్యలు ప్రారంభించారు. సీజనల్ వ్యాధులైన వైరల్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. డ్రెయిన్లలో పూడికలు తీయించారు. మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నట్లు సర్పంచ్ నాగరాజు తెలిపారు. గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

## రమ్య మృతి ఘటన: ప్రభుత్వ చర్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ సంతృప్తి



గుంటూరు,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: రమ్య మృతిపై ప్రభుత్వం ఎలా స్పందిచిందో జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసి వివరించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్?సోషల్ జస్టిస్ గవర్నమెంట్ అడ్వైజర్ జూపూడి ప్రభాకర రావు మాట్లాడుతూ.. 24 గంటల్లోపు పోలీసులు నిందితుడిని పట్టుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం బాధిత కుటుంబానికి సాయం చేశామన్నారు. ప్రభుత్వ చర్యలకు జాతీయ ఎస్సీ కమిషన్ సంతృప్తి చెందినట్లు పేర్కొన్నారు.సీఎం జగన్ న్యాయం చేశారని రమ్య కుటుంబసభ్యులే చెప్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం వెంటనే స్పందించి నాలుగు రోజుల్లో న్యాయం చేసిందని కమిషన్ చెప్పినట్లు తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఘటనపై చంద్రబాబు నీచ రాజకీయాలు మానుకోవాలని జూపూడి ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు డొక్కా మాణిక్య వరప్రసాద్, మేరుగ నాగార్జున, విడదల రజని, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ ఎస్సీ కమిషన్‌కు బుక్‌లెట్ అందించాం: వర్ల

అమరావతి: దళితులపై దాడులకు సంబంధించి జాతీయ ఎస్సీ కమిషన్‌కు బుక్ లెట్ అందించామని టీడీపీ సీనియర్ నేత వర్లరామయ్య తెలిపారు. రమ్య కేసులో మాత్రమే ప్రభుత్వాన్ని అభినందించాం అని ఎస్సీ కమిషన్ సభ్యులు అన్నారని చెప్పారు. తాము ఇచ్చిన అధారాలను ఎస్సీ కమిషన్ పరిశీలించిందన్నారు. త్వరలో ఢిల్లీ పిలుస్తాము అని ఎస్సీ కమిషన్ సభ్యులు చెప్పారని పేర్కొన్నారు. అవసరం అయితే ప్రతి కేసులో డీజీపీ వివరణ కొరతాము అని ఎస్సీ కమిషన్ సభ్యులు చెప్పారని తెలిపారు.

# కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ ఒక్కటే మార్గం నగర మేయర్

**18 సంవత్సరాలు పైబడి వారికి వ్యాక్సిన్ డ్రైవ్**

**నేటికి 8,61,237 మంది వ్యాక్సిన్ -ఇంటింటి ఫీవర్ సర్వే 23వ రౌండ్**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : సీఎం వైఎస్ జగన్ మెహన్ రెడ్డి నేతృత్వంలో కరోనా క్లిష్ట పరిస్థితులను ప్రభుత్వం సమర్ధవంతంగా ఎదుర్కొంటోందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కరోనా వైరస్ నియంత్రణ, నిర్ధారణ పరీక్షలు, కరోనా నియంత్రణకు నగర పాలక సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ తెలిపారు.. విజయవాడలో జనవరి నెలలో సీఎం చేతుల మీదుగా గవర్నమెంట్ ఆస్పత్రి నందు వ్యాక్సిన్ డ్రైవ్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఫ్రంట్‌లైన్ వర్క్స్, ప్రభుత్వ ఉద్యోగులు, ఐదేళ్లలోపు చిన్నారులున్న తల్లులందరికీ, 45 సంవత్సరాలు నిండిన వారికి కోవిషీల్డ్, కోవాక్సిన్ మొదటి డోస్‌గా 6,48,562 మందికి ,మొదటి మరియు రెండోవ డోస్ టీకా కల్పి నేటికి 8,61,237 మందికి వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. మూడో దశ కరోనాపై ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రజలందరికీ వ్యాక్సినేషన్ ద్వారా రక్షణ కల్పించి, తగు చికిత్సలు అందించాలని అదేశించడం అయిందని, అందులో భాగంగా ఈ నెల 23 నుంచి 18 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాల లోపు వారికి కూడా వ్యాక్సిన్ వేయడం ప్రారంభించడం జరిగిందన్నారు. దీనికై నగరంలోని వార్డు సచివాలయాలు, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలల్లో వ్యాక్సిన్ కార్యక్రమము ప్రారంభించినట్లు, కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ ఒక్కటే శాశ్వత మార్గం అని, యువత సహకరించాలని పిలుపునిచ్చారు.. వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందన్నారు. నగర పరిధిలో 18 సంవత్సరాల పైబడిన వారందరికీ వ్యాక్సినేషన్ అందించాలనే లక్ష్యంతో వార్డ్ సచివాలయాలు, అర్బన్ హెల్త్ సెంటర్ లలో మొదటి డోస్ గా కోవిషిల్డ్ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు వివరించారు. ఆందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే 23వ రౌండ్

కరోనా వ్యాప్తి నియంత్రణలో భాగంగా హెల్త్ సెక్రటరీలు వార్డు పరిధిలో కోవిడ్ పరిక్షలు విధిగా నిర్వహించడంతో పాటుగా ఇంటింటి ఫీవర్ సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు.. నగరంలో ఇప్పుడు 23వ రౌండ్ ఇంటింటి పివర్ సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం ఆశ వర్కర్ల, %ూచీవీ% సచివాలయ వాలంటరీలు ఇంటింటి ఫీవర్ సర్వే చేయడంతో పాటు ప్రజలకు కరోనా వైరస్ గురించి అవగాహనా కల్పిస్తూ తగు సలహాలు సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన గోగులమూడి



గన్నవరం, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఎస్సీ కమిషన్ చైర్మన్ శ్రీ మారుమూడి విక్టర్ ప్రసాద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన జై మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోగులమూడి రాము మరియు వైస్సార్సీపీ పార్టీ దళిత నాయకులు.

## వైద్య శిబిరాలకు విశేష స్పందన



ఇబ్రహీంపట్నం ,ప్రజాపాలన ప్రతినిధి: జూపూడి, కాచవరం గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మండల వైసీపీ నాయకులు పర్యవేక్షించారు. వైద్యాధికారి సుధా ప్రసూజ, పలు విభాగాల వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు వైద్య శిబిరాలకు తరలివచ్చి వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపటం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే రవాణా రంగం కీలకం !: మంత్రి పేర్ని నాని





మచిలీపట్నం ప్రజాపాలన ప్రతినిధి : డ్రైవింగ్ చేసేటప్పుడు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండటం మంచి డ్రైవర్ ఉత్తమ లక్షణమని, ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే రవాణా రంగం ఎంతో కీలకమైనదని రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య ( నాని ) అన్నారు.మంగళవారం ఉదయం తన కార్యాలయం వద్దకు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలుసుకొని వారితో ముఖాముఖిగా మాట్లాడారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గూర్చి అడిగి తెలుసుకొని ఎన్నో సమస్యలకు మంత్రి పేర్ని నాని అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. గుడివాడకు చెందిన తెలుగు రాష్ట్ర భారీ వాహన డ్రైవర్స్ అండ్ క్లీనర్ల హక్కుల సాధన సమితికి చెందిన పలువురు సభ్యులు మంత్రి పేర్ని నానిను కల్సి తమ సమస్యలను చెప్పుకొన్నారు. తమకు గౌరవ ప్రదమైన గుర్తింపు, రిటైర్మెంట్ అయిన తరువాత ప్రావిడెంట్ ఫండ్ ,పెన్షన్ అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన నిధులను రోజువారి సరుకు రవాణా వాహనం నుండి, డీజిల్ అమ్మకాల నుండి, భారీ వాహన అమ్మకాల నుండి పన్ను రూపేణా కొంత మేరకు పన్నుల రూపంలో వసూలు చేసి ఒక సంక్షేమ నిధి ఏర్పాటుచేయాలనీ మంత్రిని వారు కోరారు. సంక్షేమ నిధి పరివేక్షణ బాధ్యతలు ప్రభుత్వం తీసుకునేటట్లు శాసన సభలో, కేబినెట్ మంత్రుల సమావేశంలో మా సంక్షేమం కోసం మీ గొంతు వినిపించి మాకు సహాయం చేయాలని మల్లిపూడి దుర్గారావు, సురభి కోటేశ్వరరావు, కాటూరు శివకుమార్, కట్టా శివన్నారాయణ, పుట్టి పవన్ కుమార్ తదితరులు మంత్రి పేర్ని నానిని అభ్యర్థించారు. ఈ విషయమై స్పందించిన మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ, మీరు ఇచ్చిన సూచనలు సాధ్యమా అసాధ్యమా అనే విషయం ముఖ్యమంత్రి మాత్రమే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొంటారని జవాబిచ్చారు. తరకటూరు గ్రామానికి చెందిన గుర్రం అమ్ములు అనే మహిళ మంత్రిని కలిసి తన రెండేళ్ల కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడని వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స అత్యవసరం అని అంటున్నారని తెలిపింది. ఆ బాలునికి సంబంధిం చిన వైద్యపరమైన నివేదిక పత్రాలు కాగితాలు తన వ్యక్తిగత కార్యదర్శి రఘురాంకు అందచేయాలని ఆమెకు సూచించారు. స్థానిక రాజుపేటకు చెందిన యతిరాజ్యం కార్తిక్ అనే యువకుడు మునిసి పాలిటీలో కారుణ్య నియామక ఉద్యోగ విషయమై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా సీఎం జగన్మోహనరెడ్డి చర్యలు

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 24: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా సీఎం జగన్మోహనరెడ్డి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడ రూరల్ మండలం కల్వపూడి అగ్రహారం గ్రామానికి చెందిన మల్లంపల్లి గంగమ్మ కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్తకు ప్రభుత్వం ప్రతి నెలా పెన్షన్ ఇస్తోందన్నారు. ప్రస్తుతం కదల్లేని పరిస్థితుల్లో మంచం పైనే గడుపుతున్నారని, వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ పెన్షన్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలని గంగమ్మ కోరారు. దీనిపై మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా 1 వ తేదీ తెల్లవారుజాము నుండే పెన్షనర్లకు ఇంటి వద్దకే పెన్షన్ మొత్తాలను అందజేస్తున్నామన్నారు. దాదాపు 2.66 లక్షల మంది వాలంటీర్లు పెన్షన్ల పంపిణీని సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 60.50 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉ న్నారని చెప్పారు. వీరికి ప్రతి నెలా రూ. 1,455.87 కోట్లను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. వితంతు, ఒంటరి మహిళ పెన్షన్ల జారీలో ఎక్కడా పొరపాట్లు లేకుండా చూస్తున్నామన్నారు. ఎక్కడైనా అనర్హులకు కూడా పెన్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వచ్చిన వెంటనే పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. సంబంధిత అధికారుల నుండి వచ్చే నివేదికలను పరిశీలించి అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూస్తున్నామని మంత్రి కొడాలి నాని తెలిపారు.

# ఉత్తరాంధ్ర నుంచి చంద్రబాబు పోటీ..?



విశాఖపట్టణం,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: వచ్చే ఎన్నికల్లో గెలుపు టీడీపీకి అత్యవసరం. అంతే కాదు. చంద్రబాబు లాంటి రాజకీయ నాయకునికి బహుశా అవే చివరి ఎన్నికలు కూడా. వరసపెట్టి వైసీపీ మరోసారి గెలిచింది అంటే ఇక టీడీపీ దుకాణాన్ని బంద్ చేసుకోవాల్సిందే. ఈ నేపధ్యంలో చంద్రబాబు అనేక రకాలుగా ఆలోచనలు చేస్తున్నారుట. ప్రాంతాలు, కులాలు, మతాలు, పొత్తులు, ఎత్తులు ఇలా ఎన్నో విషయాల్లో చంద్రబాబు మదింపు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని టాక్. టీడీపీకి ఉత్తరాంధ్రా జిల్లాలు పెట్టని కోటలు. అక్కడ మళ్ళీ విజయఢంకా మోగించకపోతే మాత్రం అధికారంలోకి రావడం కల్లగానే మిగిలిపోతుంది. అమరావతి అంటూ చంద్రబాబు కలవరిస్తున్నారు. ఇది వైసీపీ చేస్తూ వస్తున్న ప్రచారం. చంద్రబాబు కూడా మన రాజధాని అమరావతి అనే అంటూ వస్తున్నారు. దీంతో విశాఖ పాలనారాజధానికి ఆయన వ్యతిరేకం అని వైసీపీ ఇప్పటికే ప్రచారం చేసింది. ఆ నినాదంతోనే జీవీఎంసీ ఎన్నికలలో వైసీపీ ఎక్కువ సీట్లు గెలుచుకుని మేయర్ పీఠాన్ని పట్టేసింది. రానున్న రోజుల్లో జగన్ విశాఖకు మకాం మార్చితే ఆ ఇంపాక్ట్ ఇంకా ఎక్కువగా ఉంటుంది. దాంతో విశాఖకు టీడీపీ వ్యతిరేకం అన్న ముద్రను పోగొట్టుకోవాలని చంద్రబాబు గట్టిగా భావిస్తున్నారుట.వచ్చే ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి లోకేష్ పోటీ చేస్తారు అన్న ప్రచారం ఇప్పటిదాకా వినిపించింది. అయితే చంద్రబాబే ఇక్కడ పోటీ చేస్తారు అన్నది తాజా ఖబర్. ఈ మధ్య భీమిలీ ఇంచార్జి కోరాడ రాజబాబు అమరావతిలో చంద్రబాబుని కలసినపుడు ఆయన భీమిలీని ఎట్టి పరిస్థితుల్లో టీడీపీని కంచుకోటగా మార్చాలని సూచించారుట. అంతే కాదు విశాఖ మీద ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాట్లుగా తెలిపారుట. దాంతో చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తారు అన్న చర్చ అయితే ఉందిపుడు. చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తే టీడీపీ కథే వేరుగా ఉంటుంది అంటున్నారు.టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీయార్ 1994 ఎన్నికల వేళ భీమిలీ నుంచి పోటీ చేస్తారని వెల్లువలా ప్రచారం సాగింది. చివరి నిముషంలో అన్న గారు తన నిర్ణయం మార్చుకుని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి పోటీ చేశారు. నాడు ఎన్టీయార్ ఉత్తరాంధ్రా జిల్లాలలో టీడీపీకి దన్నుగా ఉంటూ పోటీ చేసి భారీ సక్సెస్ సొంతం చేసుకున్నారు. ఇపుడు అదే ఫార్ములాను చంద్రబాబు కూడా అమలు చేయబోతున్నారు అంటున్నారు. అంటే మూడు దశాబ్దాల తరువాత అల్లుడు కూడా ఉత్తరాంధ్రానే ఎంచుకుంటారు అంటున్నారు. చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తే ఆ ప్రభావం కచ్చితంగా మూడు జిల్లాల మీద ఉంటుందని, అదే విధంగా తాము విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న సంకేతాన్ని కూడా బలంగా ఇస్తుందని అంటున్నారు. ఇక వైసీపీ రాజకీయ దూకుడుకు కూడా అలా అడ్డుకట్ట వేస్తూ అత్యధిక సీట్లు గెలుచుకోవచ్చు అని కూడా ఆలోచిస్తున్నారుట. మరి చూడాలి ఈ ప్రచారం కనుక నిజం అయితే మాత్రం విశాఖ కేంద్రంగానే ఏపీ రాజకీయం హోరెత్తడం ఖాయం.

## చిరంజీవి రెడ్డి ఫ్లెక్సీలను తొలగించిన మున్సిపల్ అధికారులు

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మెట్టుకూరు అభిమానులు




కావలి ఆగస్ట 24, ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గా ఎన్నికైన మెట్టుకూరు చిరంజీవి రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ కావలి పట్టణంలో ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అర్ధరాత్రి మున్సిపల్ అధికారులు తొలిగించడంతో చిరంజీవి రెడ్డి అభిమానులు మున్సిపల్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క అదే శుభాకాంక్షలు తెలియజేస్తూ నుడా చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపుతూ కట్టిన ఫ్లెక్సీలను , ఓ ప్రయివేటు హస్పటల్ ఫ్లెక్సీలను ఉంచి చిరంజీవి రెడ్డి ఫ్లెక్సీలను తొలిగించటం వెనుక రాజకీయ కక్షలు ఉన్నట్లు ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు.. మున్సిపల్ అధికారులు మాత్రం మాకు కొందరు అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే తొలిగించినట్లు ఈ వివాదంలో మాకు ఎటువంటి సంబంధం లేదని తెలుపుతున్నట్లు సమాచారం.



అయితే పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ చలానా కట్టాలని మున్సిపల్ అధికారులు తెలుపుతున్నా అవి కొందరికే వర్తిస్తున్నట్లు తెలియవస్తుంది.దీంతో సామాన్య ప్రజలను మాత్రం ఎదైనా ఒకరోజు పెళ్లికో లేక మరొక సందర్భంలో ఎదైనా ఫ్లెక్సీ ఎర్పాటు చేస్తే మున్సిపల్ అధికారులు వారి దగ్గర ముక్కు పిండి వసూలు చేసే అధికారులు ,అందరికీ సమన్యాయం లేకుండా వారికి నచ్చినట్లు వ్యవహరించటం పలు విమర్శలకు తావిస్తోంది. అయితే చిరంజీవి రెడ్డి మీద కోపంతో ఫ్లెక్సీలను తొలిగించారో లేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన నాయకుల మీద కోపంతో ఫ్లెక్సీలు తొలిగించారో ఆయన అభిమానులు ఆరా తీస్తున్నారు. అయితే చిరంజీవి రెడ్డి పై అభిమానంతో ఒక బీసీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మాత్రమే తొలిగించటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఒక పక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం పార్టీలో బీసీలకు గౌరవ ప్రధమైన స్థానం కల్పిస్తూ ప్రోత్సహిస్తుంటే అందుకు బిన్నంగా కావలిలో అధికార పార్టీ నాయకత్వం వ్యవహరించటం బీసీలలో ఆగ్రహానికి గురిచేస్తోంది. కావలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే ఇతర నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలకు కాని ఇతర పార్టీల నేతలకు కానీ శుభాకాంక్షలు తెలియచేయాలంటే మున్సిపల్ అధికారుల పర్మిషన్ తీసుకోవాలో లేక ఇంకెవరైనా పర్మిషన్ తీసుకోవాలో తెలియజేస్తే అలానే నడుచుకుంటామని వారు తెలుపుతున్నారు. కావలిలో బీసీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మాత్రమే తొలిగించటం అటు అధికారులపై ,ఇటు నాయకులపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ సమస్య ఎటువైపు దారి తీస్తోందో వేచి చూడాలి.

# కిషన్ రెడ్డి సడెన్ విజిట్ సంగతేంటీ...?



విజయవాడ, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో ఒక అనూహ్య సన్నివేశం చోటు చేసుకుంది. బీజేపీకి చెందిన అగ్ర నేత. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంటిని వెళ్ళి ఆతీధ్యాన్ని స్వీకరించడం. నిజంగా ఇది ఏపీ రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే ఆయన పార్టీ కార్యక్రమం మీదనే ఏపీలో పర్యటించారు. జన ఆశీర్వాద యాత్ర పేరిట ఆయన ఏపీలో సభ పెట్టి వైసీపీని తెగనాడారు, అదే సమయంలో బీజేపీ ప్రభుత్వాన్ని పొగిడారు. ఇలా ఏపీలో పొలిటికల్ హీట్ పెంచిన ఆయన సడెన్ గా జగన్ ఇంట్లో ప్రత్యక్షం అయ్యారు. జగన్ సైతం ఆయన్ని సాదరంగా ఆహ్వానించి ముచ్చట్లు పెట్టారు.ఏపీలో చోటు చేసుకున్న ఈ పరిణామంతో తెలుగుదేశం ఉలిక్కిపడింది. ఎందుకంటే అటు జగన్ కి బీజేపీ మధ్య బాగా చెడింది అని ఆ పార్టీ భావిస్తోంది. ఈ మాత్రం సందు దొరికితే చాలు దూరిపోవచ్చు అని కూడా ఎత్తులు వేస్తోంది. ఏది ఏమైనా జగన్ బలం పెరగకుండా చూడాలి అంటే ఢిల్లీ బంధం తెంచేయాలి అన్నదే టీడీపీ వ్యూహకర్తల ప్లాన్. ఆగస్ట్ నెల మొదలవుతూనే అలాంటి హీట్ కనిపించింది, వైసీపీ మంత్రి పేర్ని నాని అయితే బీజేపీ తమ సర్కార్ ని కూలదోస్తోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. అలా అటూ ఇటూ కూడా విమర్శల పర్వం సాగిన తరువాత ఇక తెగేదాకా లాగేశారు పుటుక్కుమనడమే అని టీడీపీ అనుకుంటోంది. కానీ ఇపుడు సీన్ రివర్స్ అయింది మరి.వెంకయ్యానాయుడు శిష్యుడిగా బీజేపీ రాజకీయాల్లో ఎదిగిన కిషన్ రెడ్డి మోడీకి ఇష్టుడు అని చెబుతారు. అందుకే ఆయనను ఏకంగా కేంద్ర క్యాబినెట్ మంత్రిగా నియమించారు. ఏపీకి ప్రత్యేకించి కేంద్ర మంత్రి లేరు. దాంతో కిషన్ రెడ్డి ఇక్కడ పార్టీ వ్యవహారాలను ఒక కంట కనిపెట్టాల్సిందే. అదే సమయంలో ఢిల్లీ పెద్దలకు ఆయన ద్వారానే పూర్తి సమాచారం కూడా అందుతుంది. తెలుగు మంత్రి అయిన ఆయన సూచనలు కూడా బీజేపీ పట్టించుకుంటుంది అన్నది వాస్తవం. ఇపుడు అలాంటి కిషన్ రెడ్డి జగన్ తో కరచాలనం చేయడం అంటే మండిపోతోంది ప్రత్యర్ధి పార్టీ.కయ్యంగా మారాలి. అది కళ్లారా చూడాలి అని ఆశించిన టీడీపీకి ఇపుడు ఆశాభంగమే అయిందనుకోవాలి. కిషన్ రెడ్డి, జగన్ భేటీ అయిన తరువాత టీడీపీ అనుకూల మీడియా రాసిన రాతలు చూస్తే సైకిల్ పార్టీ అసహనం అందులో కనిపిస్తోంది. నిజానికి బీజేపీ జగన్ని ఏమీ చేయదు అని విశ్లేషకులు కూడా చెబుతారు. జగన్ నమ్మకమైన మిత్రుడిగానే వారు చూస్తారు. ఆయన కోరిన తీరున సాయం చేయకపోయినా ఆయన మీద భారీ యాక్షన్ ప్లాన్ చేసి టీడీపీకి మాత్రం అవకాశం ఇవ్వరనే అంటారు. ఇక ఏపీలో జగన్ బలం కూడా ఢిల్లీ పెద్దలకు తెలుసు. ఇపుడు ఏపీ రాజకీయ పార్టీలకు అర్ధమైన మరో విషయం ఏంటి అంటే జగన్ కి కూడా బీజేపీలో మంచి మిత్రులు ఉన్నారని. అది తట్టుకోవడం బహుశా టీడీపీకి కష్టమే కావచ్చు.

# క్రాస్ రోడ్స్ లో గాజువాక

విశాఖపట్టణం,ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: గాజువాక ఇపుడు విశాఖ కంటే కూడా ఎక్కువగా వినిపిస్తున్న పేరు. పారిశ్రామికవాడగా ఈ ప్రాంతానికి ఎపుడూ ప్రాధాన్యత ఉంది. ఇదిలా ఉంటే గాజువాక 2009లో ఏర్పాడిన తరువాత అక్కడ రాజకీయం ఎపుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంది. 2009లో ప్రధాన పార్టీలను కాదని అక్కడ జనం కొత్తగా వచ్చిన ప్రజారాజ్యానికి ఓటేసి గెలిపించారు. ఇక 2014 నాటికి టీడీపీ గెలిస్తే 2019 ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. ఇలా ప్రతీ ఎన్నికలోనూ విలక్షణతను చూపిస్తూ పార్టీల రాజకీయాన్ని తారుమారు చేస్తున్న ఘనత గాజువాక ఓటర్లదే.విశాఖ ఉక్కు కర్మాగారం గాజువాకలోనే ఉంది. విశాఖకే కాదు, ఏపీకి తలమానికం లాంటి ఈ ప్లాంట్ ప్రైవేట్ చేసేందుకు కేంద్రం దూకుడు చేస్తోంది. దాంతో వేలాదిగా ఉన్న కార్మిక లోకం అగ్గి రాజేస్తోంది. గాజువాకలో ఉక్కు కార్మికులే మెజారిటీగా ఉంటారు. వారి దయ ఉంటేనే ఎవరైనా రాజు అయ్యేది. దాంతో ఈసారి ఉక్కు సమస్య గాజువాకలో నేతల రాజకీయాలను తిరగరాస్తాయని అంటున్నారు. అదే విధంగా ప్రధాన పార్టీలకు కూడా చుక్కలు చూపించడం ఖాయమనే మాట వినిపిస్తోంది.గతసారి గాజువాక నుంచి తిప్పల నాగిరెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. కానీ ఈసారి ఆయనకు గెలుపు అంత సులువు కాదు అంటున్నారు. అదే నేపధ్యంలో ఆయన వారసులకు కూడా జగన్ టికెట్లు ఇవ్వరని చెబుతున్నారు. గాజుకలో స్టీల్ ప్లాంట్ లీడర్ గా ఉంటూ మొత్తం అటునుంచి కథ నరుక్కువస్తున్న మంత్రి రాజశేఖర్ కి ఈసారి వైసీపీ టికెట్ ఇచ్చి ఉక్కు సెగ నుంచి తప్పించుకుంటుంది అంటున్నారు. అదే విధంగా టీడీపీ తరఫున కూడా ఉక్కు పోరాటం చేసిన వారికే ఎంపిక చేస్తారుట. పొత్తు టీడీపీతో ఉంటే జనసేన నుంచి ఉక్కు నేపథ్యం ఉన్న కోన తాతారావు బరిలో ఉంటారని అంటున్నారు.గాజువాకతో పాటు అటు పెందుర్తి, విశాఖ పశ్చిమ ఉత్తర నియోజకవర్గాల మీద విశాఖ ఉక్కు పోరాటం ప్రభావం పడుతుంది అన్న అంచనాలు ఉన్నాయి. దాంతో దానికి ధీటుగా అధికార ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్ధులను రెడీ చేసుకుంటున్నారు అంటున్నారు. విశాఖ ఉక్కు ప్రీవేటీకరణ జరిగితే ఒకలా జరగకపోతే మరోలా ఇక్కడ సీన్ ఉంటుంది. మొత్తానికి ఈసారి కూడా అందరినీ గాజువాక అట్రాక్ట్ చేస్తుంది అంటున్నారు. గతసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గాజువాక నుంచి పోటీ చేసిన సంగతి విదితమే. మొత్తానికి విశాఖ ఉక్కు కాదు కానీ అన్ని రాజకీయ పార్టీల రాజకీయ సరదా ఈసారి తీర్చేసేలా కథ సాగుతుంది అంటున్నారు

# ప్రతిపక్షాల ఐక్యత అంత ఈజీకాదు...

ప్రతిపక్షాలు పోరాటానికి కదులుతున్నాయి. మొన్నటివరకూ పార్లమెంటులో చాటుకున్న ఐక్యతను రాజకీయ సంఘటితత్వానికి పెట్టుబడిగా వాడుకునేందుకు సన్నద్ధం అవుతున్నాయి. అన్నిపార్టీలకు కావాల్సింది ఒకటే. మోడీ నాయకత్వంలోని బీజేపీని ఓడించాలి. అదొక తప్పనిసరి అవసరంగా మారిపోయింది. అందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఏకాభిప్రాయం మాత్రం లేదు. అందుకే ప్రస్తుతానికి రాజకీయ పొత్తులపై ముందుకు వెళ్లేందుకు ఇంకా తయారు కాలేదు. ఉద్యమానికి సూత్రప్రాయ ఏకాభిప్రాయం నెలకొంది. దేశంలోని 19 ప్రధాన పార్టీలు ఆందోళనల పర్వమైన అజెండాను ఖరారు చేసుకున్నాయి. పెద్దపార్టీలుగా ముద్రపడిన మరో అరడజను పార్టీలు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెసు సారథ్యంలోని ఆందోళనల కూటమికి సమదూరంగా ఉండిపోయాయి. సోనియా నాయకత్వంలోని విపక్షాల ఆన్ లైన్ వర్చువల్ సమావేశం సాధించిన విజయం ఇదే. అయితే ఇంకా ఎన్నికల సమయానికి వేయాల్సిన అడుగులు చాలానే మిగిలి ఉన్నాయి. అందుకే ముందుగా పోరాటం మొదలు పెట్టాలి. ఆ తర్వాతనే ఐక్య ఎన్నికల సంఘటనకు ప్రయత్నించాలనే భావన వ్యక్తమవుతోంది. పోరాటానికి– పొత్తుకు మధ్య ఇంకా అంతరం కొనసాగుతూనే ఉంది.కూటమి కట్టాలనుకుంటున్న పార్టీల్లో కాంగ్రెసు తర్వాత పెద్ద పార్టీ తృణమూల్ కాంగ్రెసు. ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఇంకా స్పష్టమైన వైఖరి తీసుకోలేకపోతున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కాంగ్రెసు, వామపక్షాల కూటమి పట్ల రాజకీయంగా ఆమె నిర్ణయం అనిశ్చితంగా ఉంది. బీజేపీని జాతీయ స్థాయిలో ఎదిరించాలనే దృఢసంకల్పం కనిపిస్తోంది. కానీ సొంత రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెసును చేరదీసేందుకు సిద్ధపడటం లేదు. బీజేపీ పశ్చిమబెంగాల్ లో బలం పుంజుకుంటుందేమోననే భయం ఆమెను వెన్నాడుతోంది. బీజేపీని వ్యతిరేకించే ఓట్లన్నీ సంఘటితం కావడం తోనే మమతకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అంతటి మెజార్టీ దక్కింది. ఆ ఓట్లను ఇతర పార్టీలతో కలిసి పంచుకోవడం ఆమెకు ఇష్టం లేదు. పశ్చిమబెంగాల్ సహా దేశవ్యాప్తంగా బీజేపీ పరువు తీసే ఉద్యమాలు చేయాలని కోరుకుంటోందామె. ఇందుకు రాజకీయ సంఘటన కావాలని ప్రయత్నిస్తోంది. పొత్తుల విషయం అప్పుడే వద్దంటూ మెలిక పెడుతోంది. ఫెగాసిస్ రహస్య నిఘా, వ్యవసాయ చట్టాలు, ధరల పెరుగుదల పోరాటానికి ప్రధానాంశాలుగా ప్రతిపక్సాలు భావిస్తున్నాయి. వీటిపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ విభేదిస్తున్నారు. సోనియా, మమత వంటి వారి అజెండాలో పెగాసిస్, వ్యవసాయ చట్టాలు మొదటి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఫెగాసిస్ ఆందోళన ప్రజలలో కదలిక తెచ్చే అవకాశం లేదనేది పవార్ అభిప్రాయం. అదే విధంగా వ్యవసాయ చట్టాలపై దేశవ్యాప్తంగా ఒకే రకమైన అభిప్రాయం లేదు. కొన్ని రాష్ట్రాల్లో రైతుసంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు ఆ చట్టాలను స్వాగతిస్తున్నాయి. ఇది ప్రతిపక్షాలకు చేదు అనుభవం మిగల్చవచ్చు. కామన్ అజెండాగా ధరల పెరుగుదలను తీసుకోవాలనేది పవార్ అభిప్రాయం. అందువల్ల ప్రతి ఒక్కరిలోనూ కదలిక వస్తుందంటున్నారు. కేరళలో మాత్రం ఆధిపత్యం చెలాయిస్తూ దేశవ్యాప్తంగా నామ్ కే వాస్తే జాతీయ పార్టీలుగా మిగిలిన వామపక్షాలు ఆటలో అరటిపండుగా మారిపోయాయి. ఏ కూటమి వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే కార్మికసంఘాలలో ప్రాధాన్యం, గత వైభవం కారణంగా వామపక్సాలకు మొహమాటపు ఆహ్వానాలు అందుతున్నాయి. బీజేపీపై గుడ్డి వ్యతిరేకత మినహా కమ్యూనిస్టు పార్టీలకు స్పష్టమైన అజెండా లేదు. మమతా బెనర్జీ ఇప్పటికే పశ్చిమబెంగాల్ లో చావు దెబ్బతీశారు. కేరళ మినహా మిగిలిన ఏ రాష్ట్రంలోనూ సొంతంగా సీట్లు గెలిచే సామర్థ్యం లేదు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు అజెండాను కాంగ్రెసు అందిపుచ్చుకోవాలని ఆ పార్టీల నాయకులు సూచిస్తున్నారు. అధికారపు పోటీ తప్ప పాలన విధానాలలో కాంగ్రెసుకు, బీజేపీకి పెద్దగా తేడా లేదు. అయినా కమ్యూనిస్టు నేతలు దింపుడు కళ్లెం ఆశతో కాంగ్రెసును పట్టుకుని వేలాడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కమలం పార్టీ ఓడిపోతుందనే కలతోనే కాంగ్రెసుకు వత్తాసునిస్తున్నారు. విధానపరమైన పోరాట అజెండా లేదు. జాతీయంగా కీలక ప్రాధాన్యమున్న ముగ్గురు నాయకులు ప్రతిపక్ష కూటమికి దూరంగా ఉండటం చర్చనీయమవుతోంది. దేశవ్యాప్తంగా దళిత సామాజిక వర్గాలలో మాయావతికి ఆదరణ ఉంది. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ లో కీలకపార్టీగా బహుజనసమాజ్ కొనసాగుతోంది. ఇక అదే రాష్ట్రం నుంచి సమాజ్ వాదీ పార్టీ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రధానప్రత్యర్థిగా తలపడబోతోంది. ఈ రెండు పార్టీలు విపక్ష కూటమి ని పట్టించుకోవడం లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త తరహా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. కాంగ్రెసు, బీజేపీ సారథ్యంలోని పార్టీలన్నీ ఒకటే అన్నది అరవింద్ కేజ్రీవాల్ నమ్మకం. ఆయన కూడా ప్రతిపక్ష రాజకీయాలను విశ్వసించడం లేదు. తమ వ్యక్తిగత, సొంత రాష్ట్రాల కారణాలతో వైసీపీ, టీఆర్ఎస్, బీజేడీ వంటి పార్టీలు కూటములను దూరం పెడుతున్నాయి. వీటిని కలుపుకునిపోకుండా ప్రతిపక్షాల పోరాటానికి సాధికారత సాధ్యం కాదు. అవి తటస్థ పాత్ర పోషిస్తే కచ్చితమైన ఫలితం రాకపోవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# వైసీపీ గూటికి గోరంట్ల అనుచరులు



రాజమండ్రి, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: రాజమండ్రి లో టిడిపి అంటే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తప్ప మరో పేరు వినపడేది కాదు. గోరంట్ల అంటే తెలుగుదేశం అనే అంతా భావించే స్థాయికి ఆయన ఎదిగారు. దాదాపు తన 39 ఏళ్ళ రాజకీయ జీవితంలో రాజమండ్రిని టిడిపి కి కంచుకోటగా మార్చిన ఘనత నిస్సందేహంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి దే అని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో పటిష్టమైన పార్టీ యంత్రాంగం ఒకప్పుడు గోరంట్ల గ్రాస్ రూట్ లో ఏర్పాటు చేసిందే.అలాంటి టాప్ లీడర్ కు గత ఏడేళ్ళు గా సొంత ఇలాఖాలో మాట చెల్లుబాట కావడం లేదు. దీనికి కారణం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబ ఆధిపత్యం, వారికి అధిష్టానం ముఖ్యంగా లోకేష్ చల్లని ఆశీస్సులే గోరంట్ల బుచ్చయ్య చౌదరి భగ్గుమనడానికి దారితీశాయి. అందుకే ఆయనలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అసంతృప్తి తలెత్తింది. రాజకీయాల నుంచే శాశ్వతంగా వైదొలగాలన్న నిర్ణయానికి వచ్చారు.ఒకటి రెండు సార్లు కాదు రాజమండ్రి కార్పొరేషన్ లో మూడు సార్లు తన వ్యూహంతో తెలుగుదేశం పార్టీకి మేయర్ స్థానం దక్కేలా చేయగలిగారు గోరంట్ల బుచ్చయ్య చౌదరి. అయితే కొంత కాలంగా పార్టీలో తనను కాదని ఆదిరెడ్డి వర్గానికి పెరిగిన ప్రాధాన్యతతో బుచ్చయ్య వర్గానికి చెందిన వారు వరుసగా వైసిపి కండువా కప్పేసుకోవడం మొదలు పెట్టారు. వీరిలో గోరంట్ల కు ప్రధాన అనుచరులుగా ఉండే మాజీ కార్పొరేటర్ లు పాలిక శ్రీనివాస్, బెజవాడ రాజ్ కుమార్ జై జగన్ అంటే మరో మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్ జై బిజెపి అని వెళ్ళి పోవడం గమనార్హం.మరికొందరు మాజీ కార్పొరేటర్ లు కూడా వైసిపి లో సీటు ఒకే అంటే వెళ్ళేందుకు సై అనేలాగే ఉన్నారు. ఇంకొందరు మాజీ కార్పొరేటర్ లు క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇవన్నీ గోరంట్ల బుచ్చయ్య చౌదరికు పార్టీలో ప్రయారిటీ తగ్గడం ఒక కారణం అయితే ఆదిరెడ్డి అప్పారావు వర్గం తో ప్రయాణం చేయలేక జరుగుతున్న పరిణామాలు గా పసుపు పార్టీలో టాక్.

ఆదిరెడ్డి మౌనం

రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇచ్చిన జర్క్ ఆ పార్టీలో ఇప్పట్లో తగ్గేది అయితే కాదు. పార్టీకి రాం రాం చెప్పేస్తా అన్న చిన్నన్న నిర్ణయం పై తూర్పుగోదావరి జిల్లాలోనే కాదు ఏపీ అంతా ప్రకంపనలు కొనసాగుతున్నాయి. పార్టీలో కానీ అధికారపార్టీలో కానీ ఏమి జరిగినా స్పందించే సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పూర్తిగా కొంతకాలంగా స్తబ్దుగానే ఉంటూ వస్తున్నారు. తూర్పు రాజకీయాలకు టిడిపి లో పెద్ద దిక్కుల్లో యనమల రామకృష్ణుడు ఒకరు. ఆయన కూడా నారా లోకేష్ స్పీడ్ అందుకున్నాక అన్ని విషయాల్లో అంటి ముట్టనట్లే వ్యవహారాలను నెట్టుకొస్తున్నారు. యనమల రామకృష్ణుడుతో సమానంగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గతంలో స్పీడ్ గా ఉండేవారు. అయితే ఆయన వైసిపి లోకి వెళ్ళి తిరిగి టిడిపి లోకి వచ్చాకా కేవలం ఆయన నియోజకవర్గం వరకే పరిమితం అయ్యారు. ఇటీవల అనారోగ్యం కూడా ఆయన్ను జిల్లా రాజకీయాల్లో చురుగ్గా లేకుండా చేస్తుంది. ఇక గోరంట్ల వంటి సీనియర్ నేతతో సమానమైన నాయకుడు తూర్పులో మరొకరు లేకపోవడం కూడా ఈ వ్యవహారంలో తలదూర్చే సాహసం ఎవరు చేయలేకపోతున్నారు. ఒక్క నిమ్మకాయల చినరాజప్ప మాత్రమే జిల్లాలో ఏమి జరిగినా చంద్రబాబు దూతగా అక్కడ ప్రత్యక్షం అవుతూ పార్టీని గాడిన పెట్టేందుకు నేతలను బుజ్జగించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.గోరంట్ల బుచ్చయ్య చౌదరి గుస్సా కు ప్రధాన కారణమైన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం తాజా పరిణామాలపై మౌనం దాల్చింది. అధినేతే అన్ని చూసుకుంటారు అనే ధీమాలో ఆ వర్గం వేచి చూస్తుంది. అదీగాక ఇటీవల పార్టీ పదవుల పందేరంలో ఆదిరెడ్డి కుటుంబం వెంట ఉన్న వారికి పదవులు బాగానే దక్కాయి.

దాంతో గోరంట్ల వేడి మీద ఉన్నప్పుడు గొంతు పెంచితే మంచిది కాదని అధిష్టానం నుంచి అందిన సమాచారంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఆమె భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియా ముందు ఈ అంశాలపై చర్చించేందుకు ఆసక్తి చూపడం లేదు.

# జగన్ క్రేజ్ తగ్గిందా...?

విజయవాడ, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: జగన్ సర్కారుపై అవకాశం చిక్కినప్పుడల్లా.. విరుచుకుపడే టీడీపీ అధినేత చంద్రబాబు.. తాజాగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేక పోయారనే వాదన వినిపిస్తోంది. తాజాగా ఏపీ సీఎం జగన్ విషయంలో ఒక చిత్రమైన ఘటన జరిగింది. ఆయనకు ఉన్న ప్రజాభిమానం తగ్గిపోయిందని.. గత ఏడాది ఉత్తమ ముఖ్య మంత్రిగా దేశంలో 4వ స్థానంలో ఉన్న జగన్.. పరిస్థితి ఇప్పుడు ఏకంగా 16వ స్థానానికి పడిపోయిందని ఓ ప్రముఖ జాతీయ మీడియా సర్వే స్పష్టం చేసింది. ఇది నిజానికి జగన్‌కు తీవ్ర ఇబ్బందికర పరిణామమే. దీనిని తట్టుకుని.. వచ్చే ఏడాది నాటికి జగన్ పుంజుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఆయన ఎందుకు ? ఇంతగా తన ప్రభావం కోల్పోయారనే విషయంపైనా దృష్టి పెట్టాలి. జగన్ క్రేజ్ ఎందుకు తగ్గిందనే దానిపై ఇప్పటికే రకరకాల విశ్లేషణలు కూడా మొదలైపోయాయి.నిజానికి జగన్ ప్రవేశ పెట్టిన పథకాలు.. అమలు చేస్తున్న సంక్షేమం వంటివి ఇతర రాష్ట్రాల్లోనూ లేవని అధికార పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు.. రాష్ట్రంలో ఎక్కడా లేని.. విధంగా ప్రజలకు వేలకు వేల రూపాయలను లబ్ధి దారుల అకౌంట్లలో వేస్తున్నారు. మరి ఇంత చేస్తున్నా.. జగన్ గ్రాఫ్ గత ఏడాదికి ఇప్పటికి ఎందుకు ? దిగజారిందనేది ప్రశ్న. ఇదిలావుంటే.. జగన్‌పై నిత్యం విమర్శలు చేసే చంద్రబాబుకు ప్రస్తుతం వచ్చిన ఈ అవకాశం ఎందుకు కనిపించలేదనేది ప్రశ్న. ఎందుకంటే.. చంద్రబాబు కోరుకున్నది ఇదే. జగన్ గ్రాఫ్ పడిపోవాలి.. తన అవసరం ప్రజలకు తెలియాలి. ఇదే చంద్రబాబు కోరుకున్నారు.ఇప్పుడు సీఎంగా జగన్ గ్రాఫ్ పడిపోవడం.. ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందనే అంచనాల నేపథ్యంలో చంద్రబాబు దీనిని అందిపుచ్చుకుని జగన్‌పై విమర్శల పర్వం పెంచుతారని అందరూ అనుకున్నారు. అయితే.. అనూహ్యంగా చంద్రబాబు మాత్రం.. ఈ విషయాన్ని పట్టించుకోలేదు.అసలు దీనిపై కామెంట్లుకూడా పెద్దగా చేయలేదు. అయితే కొన్ని మీడియా సంస్థలు మాత్రం జనం మెచ్చడం లేదంటూ.. జగన్‌పై విమర్శలతో కథనాలు వండి వార్చేశారు. పోనీ .. వీటిని కూడా టీడీపీ పట్టించుకున్నట్లు లేదు. ఈ క్రమంలో ఒక విషయాన్ని విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు.ఇప్పుడు జగన్‌ను విమర్శిస్తే.. ఇదేసమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి విషయం కూడా ప్రస్తావనకు తీసుకురావాల్సి ఉంటుందని.. తొలి పది మంది ముఖ్యమంత్రుల్లో కేసీఆర్ కూడా లేరని.. సో.. జగన్‌ను విమర్శించి కేసీఆర్‌ను పక్కన పెడితే.. టీడీపీని కార్నర్ చేస్తూ.. వైసీపీ కూడా విమర్శలు చేసే అవకాశం ఉంటుందని చంద్రబాబు భావించి ఉంటారని అంటున్నారు. ఈ పరిణామాలతోనే చంద్రబాబు ఫుల్‌గా సైలెంట్ అయ్యారని అంటున్నారు. ఏదేమైనా.. ఒక మంచి ఛాన్స్ మాత్రం చంద్రబాబు మిస్ చేసుకున్నారని మాత్రం చెబుతున్నారు.

## కశ్మీర్ లో కాంగ్రెస్ కుదురుకుంటోందా..?

శ్రీనగర్, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: నిన్న మొన్నటి దాకా నిద్రాణంగా ఉన్న కీలక సరిహద్దు రాష్ట్రమైన జమ్ము– కశ్మీర్ కాంగ్రెస్ లో కదలిక తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడి పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం నింపేందుకు, ఎన్నికల పోరాటంలో పాల్గొనేందుకు సమాయత్తం చేస్తున్నారు. 370వ అధికరణ రద్దు నుంచి రాష్ట్ర పార్టీ శ్రేణుల్లో ఒకింత అనాసక్తి, గందరగోళం నెలకొన్న మాట వాస్తవం. హస్తినలోని అధిష్టాన పెద్దలు సైతం ఈ దిశ గా చొరవ చూపని మాట వాస్తవం. అదే సమయంలో మూడు ప్రధాన పార్టీలైన భారతీయ జనతా పార్టీ, ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) రాష్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370, 35ఏ అధికరణల రద్దు నుంచి వివిధ రకాల కార్యక్రమాలతో క్రియాశీలకంగా ఉన్నాయి. నిత్యం ఏదో పేరుతో ప్రజల్లోకి వెళుతున్నాయి. చర్చలు, ర్యాలీలు, సభలతో రాజకీయంగా చురుగ్గా ముందుకు సాగుతున్నాయి.ఈ నేపథ్యంలో తాను వెనకబడ్డానని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్వయంగా పార్టీ అగ్రనేత, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేరుగా రంగంలోకి దిగారు. ఆగస్టు 9,10తేదీల్లో రాష్టంలో పర్యటించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా తొలుత 9వ తేదీన ఆయన రాష్ట్ర రాజధాని నగరం శ్రీనగర్ చేరుకున్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన ముస్లిం, హిందూ ఓటర్లను ఆకట్టుకునే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్య కశ్మీర్ లోని గండేర్బల్ ప్రాంతంలోని ప్రసిద్ధ మాతా ఖీర్ భవానీ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ పూజలు జరిపి, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఇందులో రాజకీయ వ్యూహం ఇమిడి ఉంది. మితిమీరిన మైనార్టీ పక్షపాత ధోరణి కారణంగా అటు జాతీయస్థాయిలో ఇటు రాష్టంలో హిందువులు పార్టీకి దూరమయ్యారు. దీంతో వారు భాజపాకు చేరువయ్యారు. కశ్మీర్ లోని కొన్ని ప్రాంతాలతో పాటు జమ్ములో హిందువుల సంఖ్య అధికం. ఈ విషయాన్ని చక్కదిద్దేందుకు కశ్మీరీ పండిట్లకు, హిందువులు పవిత్ర స్థలంగా భావించే భవానీ మాత ఆలయాన్ని సందర్శించారు. 2014 ఎన్నికల్లో మొత్తం 87కు గాను భాజపా కేవలం హిందువుల ఓట్ల కారణంగానే 25 సీట్లు సాధించి పీడీపీ (28 సీట్లు) తరవాత రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది.శ్రీనగర్ లోని ప్రఖ్యాత హజ్రత్ బల్ మసీదునూ రాహుల్ సందర్శించారు. ముస్లింల ఓట్లు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మధ్య చీలగా హిందువుల ఓట్లు గంపగుత్తగా 2014లో భాజపాకు పడ్డాయి. ఫలితంగా కాంగ్రెస్ 2014 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో 12 సీట్లకే పరిమితమైంది. దీంతో తనకు హిందువులు, ముస్లిములు ఒకటేనని చాటేందుకే ఆలయం, మసీదు సందర్శన ద్వారా రాహుల్ సమతూకం పాటించినట్లు స్పష్టమవుతోంది. తమది కశ్మీరేనని తొలి రోజుల్లో తమ కుటుంబం ఇక్కడే గడిపిందని జీలం నది జలాలను తాగిందని సెంటిమెంటు రంగరింపజేశారు.అనివార్య కారణాల వల్ల ఇక్కడి నుంచి అనంతరం అలహాబాద్ తరవాత ఢిల్లీకి మకాం మార్చామని, కశ్మీర్ కు వస్తే తనకు సొంత ఇంటికి వచ్చిందన్న భావన కలుగుతుందని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా శ్రీనగర్ లో కొత్తగా నిర్మించిన కాంగ్రెస్ భవన్ ను ప్రారంభించారు. పీసీసీ చీఫ్ గులాం మహమ్మద్ మీర్ కుమారుడి పెళ్లికి హాజరయ్యారు. మీర్, పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ వర్గాల మధ్య సయోధ్యకు ప్రయత్నించారు. వర్గపోరు పార్టీకి పెద్ద ప్రతిబంధకంగా మారింది. రాహుల్ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమైందో తెలియాలంటే కొంతకాలం వరకు వేచి చూడక తప్పదు.

## వరుస ఆడియో లీకులు..

విశాఖపట్టణం, ఆగష్టు 24, ప్రజాపాలన ప్రతినిధి: రాజకీయాలల్లో రాళ్ళు ఎటు నుంచి దూసుకువస్తాయో ఎవరికీ తెలియదు. అలా వచ్చినవి అటూ ఇటూ తగిలి ఊరుకుంటాయి అనుకుంటే పొరపాటే. చివరికి అవి నేరుగా అధినాయకుడికే తగులుతాయి. దాని వల్ల అతి పెద్ద డేంజర్ కూడా పార్టీకి జరుగుతుంది. మరి ఈ విషయం గ్రహించారో లేదో కానీ వైసీపీ నేతల ఆడియో లీకుల మీద జగన్ పెద్దగా సీరియస్ గా ఉన్నట్లుగా లేదు. ఏపీలో ఇపుడు కొత్త రకం రాజకీయం సాగుతోంది. వైసీపీ సర్కార్ ఫెయిల్యూర్స్ అని ఒక వైపు చర్చకు పెడుతున్న విపక్షాల నాయకులు వాటితో పాటుగా రాసలీలల ఆడియో లీకులను కూడా వాడుకుంటూ ఏకంగా రాష్ట్రంలో మహిళా భద్రతనే ప్రశ్నిస్తున్నారుఒకటి జరిగితే పొరపాటు అనుకోవచ్చు. కానీ అదే అలవాటుగా మారితే మాత్రం ఇక ఉపేక్షించి లాభం లేదు. నిజానికి గత ఏడాది థర్టీ యియర్స్ ఇండస్ట్రీ పృధ్వీ విషయంలో ఇలా జరిగినపుడే జగన్ పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాల్సింది. కానీ ఆయన్ని పక్కన పెట్టేశారు. తరువాత సీనియర్ ఎమ్మెల్యే అంబటి రాంబాబు బుక్ అయ్యారు. ఇపుడు విశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ పేరు బయటకు వచ్చింది. దాంతో ఇది జగన్ సర్కార్ ప్రతిష్టకే మచ్చగా మారుతోంది. దాంతో ప్రభుత్వం దీని మీద గట్టిగానే రియాక్ట్ అవాలన్న మాట అయితే వినిపిస్తోంది.వైసీపీ సర్కార్ కి, పార్టీకి జగనే నాయకుడు. అందువల్ల వైసీపీలో ఏ ఘటన జరిగినా చుట్టుకునేది మాత్రం జగన్ కే అన్నది తెలిసిందే. ఆయన అయితే పూర్తి సైలెంట్ గా ఉంటారు. ఆయనకు తన మనుషుల మీద నమ్మకం ఉండవచ్చు కాక. కానీ దీన్ని ఆసరాగా చేసుకుని విపక్షాలు సోషల్ మీడియాలో ఒక్క లెక్కన ఆట ఆడేసుకుంటున్నాయి. దాని వల్ల బురద వచ్చి మొత్తం వైసీపీ మీదనే పడుతోంది మరి జగన్ యాక్షన్ అన్నది ఏదైనా తీసుకోకపోతే ఇంకా చాలా ఆడియో లీకులు బయటకు వస్తాయని కూడా అనుమానిస్తున్నారు.ఇక జనాలు సాధారణంగా సున్నితమైన విషయాల్లో గట్టిగానే ఉంటారు. రాజకీయాలు వేరు, ఇలాంటివి వేరు. నేతల అవినీతి ఆరోపణలు ఎన్ని వచ్చినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే ఎవరు మాత్రం పతిత్తులు అన్నది జనం భావన. కానీ మహిళలతో వైసీపీ నేతల రాసలీలలు అంటూ వస్తున్న ఆడియోలు లీకుల ప్రచారం అయితే మాత్రం అది పార్టీకే పెద్ద దెబ్బగా మారుతుంది. మరో వైపు దిశ చట్టం మహిళా భద్రత గురించి గొప్పగా చెప్పుకుంటున్న వైసీపీకి ఈ పరిణామాలు అసలు మింగుడు పడకపోవచ్చు. సొంత పార్టీ వారే ఇలా చేస్తున్నారా అన్న డౌట్లు జనాల్లోకి వెళ్తే ఏం చెప్పినా బూమరాంగ్ అవుతుంది. అందువల్ల ఈ ఆడియో లీకుల వెనక ఎవరు ఉన్నారు లెక్క తేల్చి బాధ్యుల మీద సీరియస్ గా యాక్షన్ తీసుకోవాల్సిన కర్తవ్యం జగన్ మీదనే ఉంది అంటున్నారు. ఆయన కనుక ఉపేక్షిస్తే మాత్రం చిరిగి చేట అయ్యేది చివరికి జగన్ ఇమేజే సుమా.

# ‘శ్రీదేవి సోడా సెంటర్’ సెన్సార్ పూర్తి.. సినిమా నిడివి ఎంతంటే..?




‘పలాస 1978’ ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా రూపొందిన తాజా చిత్రం ‘‘శ్రీదేవి సోడా సెంటర్’’. ఇందులో ఆనంది హీరోయిన్ గా నటించింది. రూరల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని ఆగస్టు 27న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే వదిలిన ప్రచార చిత్రాలు – టీజర్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. అలానే ఇటీవల సూపర్ స్టార్ మహేష్ బాబు చేతుల మీదుగా రిలీజైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది.ఇకపోతే ‘శ్రీదేవి సోడా సెంటర్’ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేశారు. తాజాగా ఈ విషయాన్ని వెల్లడించిన చిత్ర యూనిట్.. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి ‘యూ/ఏ’ సర్టిఫికేట్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ సినిమా రన్ టైమ్ రెండున్నర గంటలు (2 గంటల 34 నిమిషాలు) వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన సుధీర్ బాబు – ఆనంది అందమైన పోస్టర్ ఆకట్టుకుంటోంది.విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ‘శ్రీదేవి సోడా సెంటర్’ మేకర్స్ అగ్రెసివ్ గా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇటీవలే నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సైతం ఈ సినిమా స్టోరీ తెలుసుకొని చిత్ర బృందాన్ని అభినందించి తన విషెస్ తెలియజేసారు. కెరీర్ ప్రారంభం నుంచీ విభిన్నమైన సినిమాలు చేస్తూ వస్తున్న సుధీర్ బాబు.. లైటింగ్ సూరిబాబు గా కనిపించనున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.ఇప్పటికే ఈ చిత్రంలో విలన్ గా నటిస్తున్న పావెల్ నవగీతన్ ని పరిచయం చేసిన చిత్ర యూనిట్.. తాజాగా సోడాల శ్రీదేవి తండ్రి సంజీవ్ రావు గా నటించిన సీనియర్ నరేష్ కు సంబంధించిన ఓ వీడియోని రిలీజ్ చేశారు. సోడా కొట్టు ఓనర్ గా.. కూతురిపై అమితమైన ప్రేమ గల తండ్రిగా.. పరువు కోసం తాపత్రయ పడే కుటుంబ పెద్దగా ఈ సినిమాలో నరేష్ పాత్ర ఉంటుందని తెలుస్తోంది. ఈ పాత్ర సినిమా సక్సెస్ కు ఏ విధంగా దోహదపడుతుందో చూడాలి.‘శ్రీదేవి సోడా సెంటర్’ చిత్రానికి సంగీత బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ కంపోజ్ చేశారు. శ్యామ్ దత్ సైనుద్దీన్ సినిమాటోగ్రఫీ అందించగా.. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ చిత్రంలో సత్యం రాజేష్ – రఘుబాబు – అజయ్ – హర్షవర్ధన్ – సప్తగిరి – రోహిణి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. 70%ఎం% ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై విజయ్ చిల్లా – శశి దేవిరెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ‘భలే మంచి రోజు’ తర్వాత ఈ బ్యానర్ లో సుధీర్ బాబు చేస్తున్న రెండో సినిమా ఇది. మరి ‘శ్రీదేవి సోడా సెంటర్’ చిత్రం థియేటర్స్ లో ఎలాంటి సౌండింగ్ చేస్తుందో చూడాలి.


# కమల్ హాసన్ విలన్ గా పుష్ప విలన్



మలయాళంలో అగ్ర కథానాయకుడిగా.. జాతీయ అవార్డ్ గ్రహీతగా సంచలనాలు సృష్టించిన ఫహద్ ఫాజిల్ కి దేశవ్యాప్తంగా గొప్ప ఫాలోయింగ్ ఉంది. వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ వరుస విజయాలతో వేగంగా ఎదిగిన హీరో అతడు. నటుడిగా విలక్షణత అతడి సొంతం. అందుకే ఇప్పుడు సౌత్ లో అన్ని భాషల్లోనూ అతడి పేరు మార్మోగుతోంది.ప్రస్తుతం బన్ని నటిస్తున్న పుష్ప చిత్రంలో ఫహద్ క్రూరుడైన విలన్ గా నటిస్తున్నాడు. పుష్పరాజ్ తో అతడి ఢీ ఎలా ఉంటుందో తెరపైనే చూడాలని టీమ్ ప్రకటించింది. ఇక ఫహద్ తమిళంలోనూ భారీ చిత్రాల్లో నటిస్తున్నాడు. విశ్వనటుడు కమల్ హాసన్ తో బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో కీలక పాత్రలను పోషిస్తున్నాడని తెలిసింది. 1992 లో విడుదలైన తమిళ క్లాసిక్ హిట్ తేవర్ మగన్ తెలుగులో క్షత్రియ పుత్రుడు పేరుతో అనువాదమై సక్సెసైన సంగతి తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచిన కల్ట్ క్లాసిక్ చిత్రమిది. ఇందులో కమల్ హాసన్ నటనకు ప్రజలు అభిమానులు జేజేలు పలికారు. భరతన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆస్కార్ రేసులో భారతదేశం తరపున అధికారికంగా ప్రవేశం దక్కించుకుంది. తెలుగు వెర్షన్ క్షత్రియపుత్రుడు ఘనవిజయం సాధించింది. ప్రముఖ తమిళ కథానాయకుడు శివాజీ గణేశన్ – కమల్ హాసన్ కాంబినేషన్ లో అరుదైన చిత్రంగా క్షత్రియపుత్రుడు హిస్టారికల్ రికార్డుల్లో నిలిచింది. మూడు దశాబ్దాల తర్వాత కమల్ హాసన్ తేవర్ మగన్ సీక్వెల్ ని ప్లాన్ చేస్తున్నారు. కమల్ ఈ మూవీకి స్క్రిప్ట్ రాస్తున్నారు. టేక్ ఆఫ్– సి యు సూన్– మాలిక్ చిత్రాలతో ఫేమస్ అయిన ప్రఖ్యాత మలయాళ దర్శకనిర్మాత మహేశ్ నారాయణన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారు. ఇందులో ఫహద్ పాత్ర ఆసక్తికరంగా ఉండనుందిట. కమల్ హాసన్ ప్రస్తుతం నటిస్తున్న విక్రమ్‌లోనూ ప్రధాన పాత్ర పోషిస్తున్న మాలీవుడ్ స్టార్ ఫహద్ ఫాసిల్ కి వెంటనే కమల్ తో మరో ఆఫర్ దక్కడం చర్చకు వచ్చింది. త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన రానుంది.

ఈవిల్ ఎప్పుడూ అంత ప్రమాదకరమైనది కాదు!! అంటూ పుష్ప నుంచి ఫహద్ ఫాజిల్ లుక్ ని నేడు చిత్రబృందం రిలీజ్ చేసింది.ఈవిల్ –ఐ ని ఎంతో క్రూరంగా ఆవిష్కరించిన తీరు భయపెట్టింది. గంధపు చక్కల స్మగ్లర్ అయిన పుష్పరాజ్ ని వెతుకుతూ వచ్చే ఈవిల్ మ్యాన్ గా ఫహద్ ఫాజిల్ కనిపిస్తారా? క్రూరుడైన విలన్ గా అతడి ఆహార్యం ఎలా ఉండనుంది? అన్నది సస్పెన్స్. ఫహద్ ఫాజిల్ బర్త్ డే సందర్భంగా పోస్టర్ ని లాంచ్ చేయగా వైరల్ అయ్యింది. గంధపు చెట్టులోంచి చూస్తున్న ఈవిల్ ఐ ఆ పోస్టర్ లో కనిపించింది. అక్కడే ఉంది అసలు ట్విస్టు. చిత్తూరు నేపథ్యంలో లోకల్ యాసతో ఈ సినిమాలో చాలా ట్విస్టులనే సుక్కూ రివీల్ చేయనున్నాడన్న టాక్ ఉంది. పుష్ప 1 ని దసరా కానుకగా రిలీజ్ చేయాలనుకున్నా సాధ్యం కాదని టాక్ వినిపిస్తోంది. క్రిస్మస్ కి పుష్ప 1 రిలీజయ్యేందుకు ఆస్కారం ఉందని తెలుస్తోంది. ఇంకా 40 లో అడుగుపెట్టక ముందే ఫహద్ ఫాజిల్ జాతీయ అవార్డ్ గ్రహీతగా చాలా సాధించాడు. పుష్పతో తన స్టార్ డమ్ ని పాన్ ఇండియా రేంజుకు విస్తరించనున్నాడు. అల్లు అర్జున్ .. కమల్ హాసన్ లతో పాటు మరో ఇద్దరు పెద్ద స్టార్ల సినిమాల్లోనూ కీలక పాత్రల్లో ఫహద్ కి ఆఫర్లు దక్కనున్నాయని తెలిసింది.

# దిల్ రాజు కుటుంబ హీరో ఆశిష్ డెబ్యూ లుక్



పరిశ్రమలో నటవారసత్వం (నెపోటిజం) అన్నివేళలా చర్చనీయాంశమే. హీరోల వారసులు హీరోలు.. నిర్మాతలు దర్శకుల వారసులు హీరోలే. చివరికి క్యారెక్టర్ ఆర్టిస్టులు విలన్ల వారసులు కూడా హీరోలుగా పరిచయం అవుతున్నారు. ఈ ట్రెండ్ అనాదిగా కొనసాగుతోంది. ఇకపోతే నెప్టోయిజం బాలీవుడ్ తో పోలిస్తే టాలీవుడ్ లో పరిమితం. ఇక్కడ ట్యాలెంట్ తో ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎదిగిన హీరోలు ఉన్నారు. ప్రతిభ ఉంటే అవకాశాలిచ్చేందుకు అగ్ర నిర్మాతలు వెనకాడడం లేదు. ఇకపోతే టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు కుటుంబం నుంచి ఒక హీరో ఇప్పుడు పరిశ్రమలో ప్రవేశిస్తుండడం హాట్ టాపిక్ గా మారింది. అతడి పేరు ఆశిష్. దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ రౌడీ బాయ్స్ లో అతడు నటిస్తున్నాడు. తాజాగా ఫస్ట్ లుక్ ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్ లో ఆశిష్ హీరోయిక్ లుక్ ఆకట్టుకుంటోంది. మంచి ఆకర్షణీయమైన రూపాన్ని అతడు కలిగి ఉన్నాడు.తన ఏజ్ కి తగ్గట్టే రౌడీ బాయ్స్ ఒక అందమైన కాలేజ్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీ అని తెలిసింది. విద్యార్థుల నడుమ వివాదాలు పోరాటాలతో ట్రెండీగా సాగే ప్రేమకథా చిత్రమిది. క్యాంపస్ డ్రామా అనగానే 90లలో వచ్చిన ప్రేమదేశం – చెలి లాంటి క్లాసిక్ చిత్రాలు గుర్తుకు వస్తాయి. ఆశిష్ ను మరీ ఆ రేంజులో ఇంట్రడ్యూస్ చేస్తున్నారా? అన్నది కాస్త ఆగితే కానీ తెలీదు.ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీ హర్ష కనుగంటి దర్శకత్వం వహిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. టాప్ కెమెరామెన్ మది సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రౌడీ బాయ్స్ ని దిల్ రాజు– శిరీష్ సంయుక్తంగా నిర్మించారు. అక్టోబర్ లో మూవీని విడుదల చేస్తారని సమాచారం.

# రంగస్థలం చిట్టిబాబులా పుష్పరాజ్ కి ఒక లోపం!




విలేజీ మాస్ బోయ్ గానో.. అడవిలో గంధపు చెక్కల దొంగగానో లేదా టెంపర్ మెంట్ ఉన్న పోలీసోడిగానో నటించాలంటే అంత సులువేమీ కాదు. కానీ ఇలాంటి అవకాశాలు వస్తే ఇరగదీస్తామని నిరూపిస్తున్నారు మన హీరోలు. రామ్ చరణ్ .. ఎన్టీఆర్.. బన్ని లాంటి స్టార్లు వేషం ఎలాంటిదైనా అదరగొడుతున్నారు.ఇంతకుముందు రంగస్థలం చిత్రంలో సిట్టిబాబుగా చరణ్ ఆహార్యం పై క్రిటిక్స్ సహా ప్రేక్షకాభిమానుల ప్రశంసలు కురిసాయి. చెవిటివాడిగా నిక్కరుపై పంచెకట్టే మాస్ గోదారి కుర్రాడిగా చరణ్ నటనకు జేజేలు పలికారు. అలాగే అవినీతి పరుడైన టెంపర్ మెంట్ ఉన్న పోలీసోడిగా నటించిన తారక్ కి అంతే బ్రహ్మరథం పట్టారు. టెంపర్ సినిమాలో చెడ్డవాడైన పోలీస్ కాస్త ఒక ఘటనతో చివరికి మంచివాడిగా పరివర్తన చెందే ఎన్టీఆర్ నటన మైమరిపిస్తుంది.ఇప్పుడు అంతకుమించి సవాల్ ని బన్ని స్వీకరించాడు. అదే పుష్పరాజ్ పాత్ర. అడవిలో గంధపు చెక్కలను దొంగిలించడం అంటే ఆషామాషీనా? చెక్ పోస్టుల్ని దాటుకుని వెళ్లాలి. భయంకరమైన ఎదురు దాడుల్ని తట్టుకోవాలి. అలాంటప్పుడు ఛేజింగులు భీకరమైన యాక్షన్ తో గాయాలు తప్పనిసరి. కాలు విరగడం భుజానికి గాయం అవ్వడం.. తుంటి జారిపోవడం లాంటివి ఉంటాయి. మరి అలా దెబ్బ తిన్న కుర్రాడి ఆహార్యం ఎలా ఉంటుందో ఒకసారి బన్నీని చూస్తే కానీ తెలీదు. తుంటికి దెబ్బ తగిలి లేదా భుజానికి గాయమై ఒక చెయ్యి పడిపోయి క్లిష్టమైన సన్నివేశం లో ఎలా నటించాలి? అన్నది కూడా ఆహార్యంలో చూపించాలి. ఆశ్చర్యకరంగా ఇంతకుముందు పుష్ప టీజర్ లో ఒక చెయ్యి కదల్చలేని ఒకవైపు కాస్త వొంగి నడిచేవాడిగా కనిపించి ఆ ఆహార్యం కోసం కష్టపడిన బన్నీని అభిమానులు మర్చిపోలేకపోతున్నారు. అది భుజానికి తగిలిన గాయం వల్ల ఆ ఛేంజ్ అని ఆ పాత్రకు ఆపాదించిన తీరు అద్భుతం అని టాక్ వినిపిస్తోంది.అభిమానులందరినీ విస్మయానికి గురిచేసే పుష్ప కొత్త లుక్ మరోసారి లీకైంది. పొడవాటి గిరజాల జుట్టు పక్కపాపిడితో గుబురుగడ్డం మీసకట్టుతో కనిపిస్తున్నాడు. స్తంభింపచేసిన భుజాన్ని కదపడమెలా.. అన్నది దాక్కో దాక్కో మేకా పాట ప్రోమోలో ఆ కష్టం కనిపించింది బన్నీలో. అచ్చంగా గంధపు చెక్కల స్మగ్లర్ పుష్పరాజ్ పాత్రలోకి ఒదిగిపోయేందుకు అల్లు అర్జున్ ఎంతగానో శ్రమిస్తున్నారు. అలా ఎడమ భుజాన్ని పెద్ద గా కదపకుండా.. ఎడమ చేతిని ఉపయోగిస్తూ పనులు నడిపించాలి. దానికి గంటల తరబడి ప్రాక్టీస్ కూడా చేశాడట. ప్రతిరోజూ గంటల తరబడి ఆ చేతి కదలికను ప్రాక్టీస్ చేసిన తర్వాత తన పాత్రలోకి ప్రవేశించాడట బన్ని. మానసిక నిపుణులు ఫిట్ నెస్ సలహాదారుల సహాయాన్ని తీసుకొని అల్లు అర్జున్ ప్రతిరోజూ పుష్పరాజ్ గా మారేందుకు ఎంతో శ్రమించారు. ఇంకా అదే పాత్ర అదే ఆహార్యంతో తాజా షెడ్యూల్ లో నటించాల్సి ఉంది.దేనికైనా ప్రాణం పెట్టి పని చేయాలి. అందుకు బన్ని ఏమాత్రం వెనకాడడు. అల వైకుంఠపురములో చిత్రంతో ఇండస్ట్రీ హిట్ కొట్టాడు. ఇప్పుడు పుష్ప డ్యూయాలజీతో పాన్ ఇండియా హిట్లు కొట్టాలని కలలుగంటున్నాడు. సుకుమార్ లాంటి ట్యాలెంటెడ్ దర్శకుడితో అతడి ప్రయాణం బిగ్ టర్న్ తీసుకుంటుందనే భావిస్తున్నారు. తన సినిమాల్లో పాత్రలను చూపిస్తూ ఆ పాత్రలకు లోపాల్ని ఆపాదించి అందులోనే హీరోయిజాన్ని ఎలివేట్ చేస్తూ సుకుమార్ చేస్తున్న ప్రయోగాలు మామూలుగా లేవు. ఇప్పుడు బన్ని ఆహార్యం మరోసారి రంగస్థలం చిట్టిబాబులా హాట్ టాపిక్ గా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB | SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com